## 80 అంకె ఆకారం వేసి

జాతీయ జెండాకు ప్రత్యేక వందనం చేసిన విద్యార్థులు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 14 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 220 | పేజీలు:12 | వెల రూ.5


## లోక్‌సభలో తొలిసారి వందేమాతరం



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**మనం 10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు**

మా ఈ పదేండ్ల ప్రస్థానంలో ఎన్నో అడ్డంకులు.. ఎన్నెన్నో అవరోధాలు.. ఏ ఆశయం కోసమైతే మనం పురుడుపోసుకుందో ఆ లక్ష్యసాధనకై అన్నింటినీ భరించాం.. అధిగమించాం.. ప్రయాణాన్ని కొనసాగించాం. నేటితో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుని సగర్వంగా 11వ వసంతంలోకి అడుగుపెడుతున్నాం. మాకు అండగా నిలబడిన మా మనం కుటుంబ సభ్యులకు (జర్నలిస్టులు, ఉద్యోగ సిబ్బంది) హృదయపూర్వక అభినందనలు.. మనం ను ఇంటిపేరుగా మార్చుకొని , అన్నింటికీ తట్టుకొని మీతోనే మా ప్రయాణం అంటూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మాతో కలిసి నడుస్తున్న మా జర్నలిస్టు సోదరులే మా బలం. పత్రిక ప్రారంభంలో ఏ మాట అయితే ఇచ్చామో అందుకు నేటికీ కట్టుబడి ఉన్నాం... ఆ లక్ష్యాన్ని సాధిస్తాం... చరిత్ర సృష్టిస్తాం.

మనం 10 వ వార్షికోత్సవ శుభ సందర్భాన మా వెన్నంటి నిలిచిన పాఠకులు ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు, మా మనం సైన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

– మేనేజ్‌మెంట్






# సోదరుడిగా.. మీ సొంతింటి కలను నిజం చేస్త



## 22- ఏ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత నాదే

కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నం

పదేండ్ల బీఆర్ఎస్ పాలనను.. రెండేండ్ల మా పాలనను బేరీజు వేసుకోండి

అన్నేండ్లు అధికారంలో ఉండి ఇప్పుడు చేతబడి చేయిస్తున్నరు

కూకట్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి

2

## మైనారిటీ రిజర్వేషన్లకు మోడీ, అమిత్ షా వ్యతిరేకం

ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్సే ● ఓట్ల గల్లంతను అడ్డుకోండి.. ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని కార్యకర్తలకు పిలుపు ● మైనారిటీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

## నా ప్రసంగం తర్వాత వేదికను శుద్ధి చేసిండ్రు

ఇది బీజేపీ పనే అని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ఆరోపణలు

ఢిల్లీ, ఆగష్టు 13: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్రమాలను బీజేపీ ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు. ఇటీవల ఉత్తరాఖండ్ లోని

...మిగతా 2లో

## బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

- 119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం
- 100 శాతం సబ్సిడీపై.. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు
- బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఆగస్టు 13: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా

...మిగతా 2లో





## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తం

ఎటువంటి లాలూచీల్లేకుండా పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు

గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే.. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇస్తోంది

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13: గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం



పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు

...మిగతా 2లో

## సర్ పేరుతో ఫేక్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు

### ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

జాబితాలో తప్పుల సవరణ.. జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలే

ఫారం తిరస్కరణకు గురైందంటూ రూ.5 కట్టాలని మోసపూరిత సందేశాలు

బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్ చెప్పొద్దు?

ఎన్నికల సంఘం ఇ(ఎ)లాంటి కాల్స్ చేయదు?.. డబ్బులు అడగదు?

అనుమానిత సందేశాలపై పోలీసులకు ఫిర్యాదు చేయండి





హైదరాబాద్, మనం ప్రతినిధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం హెచ్చరించారు. నగదుతో పాటు సున్నితమైన బ్యాంకింగ్ వివరాలను దొంగిలించేందుకు కొందరు మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు పంపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల గురించి సీఈఓ

...మిగతా 2లో

## అంతర్జాతీయ వేదికపై నిమ్స్ కీర్తి పతాక

సైంటిస్ట్-ఇన్-రెసిడెన్స్‌గా డాక్టర్ తిరుమల్ ఎర్రగుంట ఎంపిక

ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు

రేపు ఓర్లాండోలో భారత స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరు

2



## నేడు మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్, ఆగష్టు 13: నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరుగనున్న దీనిలో పంద్రాగస్టు నుండి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ, కొత్తగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ వంటి రేపట్నుంచి అమలు చేయనున్న కొత్త పథకాలతో పాటు.. ఎల్నినో నేపథ్యంలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, తదితర అంశాలపై చర్చలు చేయనున్నట్లు సమాచారం.

## రూపాయికే ఉచిత సిమ్

### ఫ్రీడమ్ ప్లాన్‌ను మళ్లీ ప్రకటించిన బీఎస్ఎన్ఎల్

హైదరాబాద్, ఆగష్టు 13: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్త వినియోగదారుల కోసం తన ఫ్రీడమ్ ప్లాన్ను మళ్లీ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రూ.1కే ఉచిత సిమ్మును అందిస్తుంది. ఫస్ట్ రీఛార్జి ప్లాన్

...మిగతా 2లో







## లష్కరే తోయిబా చీఫ్‌కు నేను దాసుడిని

- పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్

ఇస్లామాబాద్, ఆగష్టు 13: పాకిస్థాన్‌లోని రాజకీయ నేతలు, ఉగ్రవాదుల మధ్య సంబంధాలు మరోసారి బహిర్గతమయ్యాయి. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను దాసుడిని అంటూ బహిరంగ వేదికపై మాజీ మంత్రి షేక్ రషీద్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అప్పుడు ఆ వేదికపై లష్కరే కమాండర్, ఇతర ఉగ్రసంస్థల సభ్యులు కూడా ఉన్నారు. "నేను హాఫీజ్ సయీద్ దాసుడను. నా ఫోన్‌లో హాఫీజ్ ఫోన్ నంబర్ దొరకడం వల్లే అమెరికా నుంచి బహిష్కరించారు" అని రషీద్ మాట్లాడారు. అలాగే సయీద్‌కు తన మద్దతు ప్రకటించారు. అంతటితో ఆగకుండా భారత్‌పై అకారణంగా విషం కక్కారు. రషీద్ 2020 నుంచి 2022 మధ్య ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. భారత్‌లో ఉగ్రకార్యకలాపాలకు

...మిగతా 2లో

## బ్రిటన్ ప్రధాని నిపుణ సలహాదారుగా గౌతమ్ రంగరాజన్



లండన్, ఆగష్టు 13: భారతీయ మూలాలున్న ప్రముఖ వ్యూహకర్త, మీడియా ఎగ్జిక్యూటివ్ గౌతమ్ రంగరాజన్‌ను బ్రిటిష్ ప్రధాన మంత్రి ఆండీ బర్న్‌హామ్ తన కార్యాలయంలోని కీలక పదవిలో నియమించారు. వివిధ వ్యవస్థల ప్రణాళిక, పనితీరుపై నిపుణ సలహాదారుగా రంగరాజన్ వ్యవహరించనున్నారు. ఇది కొత్తగా సృష్టించిన పదవి. బీబీసీ మాజీ వ్యూహకర్త, సంగీతకారుడు అయిన రంగరాజన్ వారంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

### యుద్ధనౌక నుంచి సముద్రంలోకి దూకి

## అమెరికా నావికుల ఆత్మహత్య!



వాషింగ్టన్, ఆగష్టు 13: పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ దేశాలను ఇంధన సంక్షోభంలోకి నెడితే.. యుద్ధరంగంలోని సైనికులకు మానసిక క్షోభ మిగుల్చుతున్నట్లు కనిపిస్తోంది. గల్ఫ్ జలాల్లో కొన్ని నెలలపాటు యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తోన్న సైనికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆహారం, మంచినీటి కొరత, అపరిశుభ్ర మరుగుదొడ్లు వారిని కుంగదీస్తున్నాయి. దాంతో యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ నౌకలోని అమెరికా నావికులు సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారని అమెరికా పత్రిక మిలిటరీ టైమ్స్ కథనం పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియా జలాల్లో మోహరించిన సంగతి తెలిసిందే. అబ్రహాం లింకన్‌లో ఐదు వేలమంది నావికులు, మెరైన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రికార్డు స్థాయిలో 250 రోజులుగా అది సముద్రజలాల్లోనే ఉంది. సుదీర్ఘ మోహరింపు, కఠిన పరిస్థితులు, మానసిక ఒత్తిడి సిబ్బందిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని గతంలోనే వార్తలు వచ్చాయి. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అటకెక్కడంతో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి కొనసాగుతోంది. మరోవైపు అబ్రహాం లింకన్ సహా ఇతర యుద్ధ నౌకలను ఉపయోగించి ఇరాన్ ఓడరేవులను యూఎస్ మరోసారి దిగ్బంధించింది. ఈ పరిస్థితులతో వారి మానసిక స్థితిని మరింత దిగజారినట్లు కనిపిస్తోంది. అలాగే తమవారిని మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో

...మిగతా 2లో

## లష్కరే తోయిబా చీఫ్‌కు నేను దాసుడిని

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడేవారి గురించి రషీద్ ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. 26/11 ముంబయి దాడికి పాల్పడిన అజ్మల్ కసబ్ చిరునామాను భారత్‌కు చెప్పింది మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అని గతంలో వ్యాఖ్యలు చేశారు. ఇక, హఫీజ్‌ను ఐరాస ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నా ప్రసంగం తర్వాత వేదికను శుద్ధి చేసిండ్రు

(మొదటి పేజీ తరువాయి)

రామ్ లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. 'నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తావించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితా..? ఇది బీజేపీ కార్యకర్తల పనే' అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖర్గేకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరానితనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు.

అయితే, బీజేపీ కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'బీజేపీ చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం'' అని హామీ ఇచ్చారు.

# సోదరుడిగా.. మీ సొంతింటి కలను నిజం చేస్త

**హైదరాబాద్, ఆగష్టు 13:** ఒక సోదరుడిగా ఉంటూ పేద ప్రజల సొంతింటి కను సాకారం చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారికి గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ లోని కేపీహెచ్ బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఒక సోదరుడిగా వారి సొంతింటి కలను సాకారం చేస్తానని చెప్పారు. అదే విధంగా కూకట్ పల్లి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కూకట్ పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.'మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం' అని రేవంత్ అన్నారు.

**భూమి 22-ఎలో పడితే నాదీ పూచీ..**

ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. 'మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తాను'అని సీఎం తెలిపారు.

**బీఆర్ఎస్ వాళ్లు చేతబడులు చేయిస్తున్నరు..**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని ఆ పార్టీ వారు కుట్ర చేశారని ఆరోపించారు. 'చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేండ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా?' అని సీఎంవ్యాఖ్యానించారు.

# మైనారిటీ రిజర్వేషన్లకు మోడీ, అమిత్ షా వ్యతిరేకం

**హైదరాబాద్, ఆగష్టు 13:** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్




అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ తెలిపారు.

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామన్నారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్ గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యానని చెప్పారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## అమెరికా నావికుల ఆత్మహత్య!

(మొదటి పేజీ తరువాయి)

తెలియని గందరగోళం నావికులు సముద్రంలో దూకడానికి కారణమై ఉంటుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం ఆరుగురు నావికులు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఈ కథనాలను అమెరికా నేవీ అధికారులు తోసిపుచ్చారు.

**ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం యుద్ధం..?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉన్నంతకాలం యుద్ధం కొనసాగుతుందా..? ఐఆర్జీసీ చేసిన హెచ్చరిక ఇదే విషయాన్ని వెల్లడిచేస్తోంది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా అమెరికాతో యుద్ధాన్ని కొనసాగించొచ్చని ఐఆర్జీసీలోని సీనియర్ అడ్వైజర్ ఒకరు వ్యాఖ్యలు చేశారు. ''యుద్ధాన్ని పొడిగించి ప్రత్యర్థిని బలహీనపర్చడం ఒక మార్గం. దీంతో ఇరాన్‌పై దాడి చేయాలనుకున్నవారు ఆలోచనలో పడతారు'' అని పేర్కొన్నారు.



# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**1.19 లక్షల మహిళలకు ప్రయోజనం**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల




ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు.

**మొదటి దశలో 1.19 లక్షల మందికి అవకాశం**

కుట్టు మిషన్లు కోరుకునే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మొదటి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి చెప్పారు. భవిష్యత్లో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**మహిళల ఉపాధికి ప్రభుత్వం అండ**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అదే విధంగా 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి**

ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్ను 'మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్' గా, సచివాలయాన్ని 'డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం''గా పేరు మార్చినట్లు తెలిపారు.

అలాగే ఈనెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్బండ్ ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై నిమ్స్ కీర్తి పతాక

**హైదరాబాద్, ఆగష్టు 13, (మనం న్యూస్):** వైద్య రంగంలో తెలంగాణ వైద్యుడికి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. నిమ్స్ న్యూరోసర్జరీ విభాగం అదనపు ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ ఎర్రగుంట అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఫ్లోరిడా (యూసీఎఫ్) ఇండియా సెంటర్లో 'సైంటిస్ట్-ఇన్-రెసిడెన్స్'గా ఎంపికయ్యారు. ఈ అత్యున్నత గౌరవాన్ని అందుకున్న తొలి భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఈనెల 9 నుంచి 16 వరకు జరుగుతున్న ఈ వారం రోజుల ప్రత్యేక విద్యా కార్యక్రమంలో డాక్టర్ తిరుమల్ చురుగ్గా పాల్గొంటున్నారు. యూసీఎఫ్ అధ్యాపకులు,వైద్య విద్యార్థులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానిక వైద్యులు,సెంట్రల్ ఫ్లోరిడా కమ్యూనిటీ సభ్యులతో ఆయన సమావేశమవుతున్నారు. ఆధునిక న్యూరోసర్జరీ పోకడలు, వైద్య విద్య, అత్యాధునిక సాంకేతికతలతో పాటు ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం తదితర కీలక అంశాలపై ఆయన విస్తృతంగా చర్చిస్తున్నారు.

**వైద్య రంగంలో విశేష సేవలు:**

ఈ పర్యటనలో భాగంగా యూసీఎఫ్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో డాక్టర్ తిరుమల్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. భారత్ మరియు అమెరికా వైద్య సంస్థల మధ్య విద్యా, పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఆయన చర్చలు జరిపారు. అలాగే, పంద్రాగష్టు రోజున ఓర్లాండోలోని యూసీఎఫ్ ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ప్రత్యేక అతిథిగా, వక్తగా హాజరుకానున్నారు.

వైద్య రంగంలో విశేష సేవలు డాక్టర్ తిరుమల్ ఎర్రగుంటకు బైపోర్టల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ, స్కల్-బేస్ సర్జరీ, వాస్క్యులర్ న్యూరోసర్జరీ, న్యూరో-ఆంకాలజీ మరియు న్యూరోట్రామా వంటి క్లిష్టమైన విభాగాల్లో అపారమైన నైపుణ్యం ఉంది. కేవలం వైద్య సేవలందించడమే కాకుండా, పరిశోధనలు చేయడంలో, విద్యార్థులకు మరియు రెసిడెంట్ వైద్యులకు శిక్షణ ఇవ్వడంలో ఆయన ముందుంటున్న తీరు ప్రశంసనీయం.

## సర్ పేరుతో ఫేక్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం సవివరంగా వెల్లడించింది. తప్పుల సవరణ, సహాయం పేరుతో మీకు కాల్స్ వచ్చే అవకాశం ఉందని, అటు ఎలక్షన్ కమిషన్, ఇటు పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. జాబితాలో కొన్ని తప్పులున్నాయని, 'ఓటరు గుర్తింపు కార్డులోని వివరాలు, 'సర్' ఫారంలోని వివరాలతో సరిపోలడం లేదని, అందుకే మీ దరఖాస్తు తిరస్కరణకు గురైందంటూ ఓటర్లకు సందేశాలు పంపుతున్నారు. సవరణ కోసం ఒక నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయాలని వారు సూచిస్తున్నారు. ఆ తర్వాత, నామమాత్రంగా రూ.5 చెల్లించాలని కోరుతూ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డుల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్, సీవీవీ నంబర్లు, ఏటీఎం పిన్‌ల వంటి అత్యంత రహస్య సమాచారాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు' అని సీఈవో వివరించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ, తెలంగాణ సీఈఓ కార్యాలయం కానీ ఓటర్లకు ఇటువంటి సందేశాలు పంపదని, ఫోన్ కాల్స్ చేయదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటువంటి మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక ఈసీఐ ప్లాట్‌ఫారమ్లను సంప్రదించాలని లేదా నేరుగా తమ బూత్ స్థాయి అధికారులను కలవాలని అధికారులు సూచించారు.

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కీ డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిండర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు.

## ప్రజలకు జవాబుదారులు అధికారులు

- **అంకిత భావంతో వారి సమస్యలను పరిష్కరించాలె**
- **ఎంపీడీవోలు సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి**
- **మండల నోడల్ అధికారుల శిక్షణ ప్రారంభంలో ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి**

**హైదరాబాద్, ఆగష్టు 13:** ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు.

గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన 560 మంది ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు.

ఎంపీడీవోలకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు.రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75% సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు.

## రూపాయికే ఉచిత సిమ్

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా లభిస్తుంది. 24 రోజుల పాటు అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్లు, రోజుకు 1 జీబీ డేటా లభిస్తుంది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ వేదికగా పేర్కొంది.

గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ప్లాన్' పేరుతో రూ.1 ప్లాన్ను తొలుత తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద 30 రోజుల వ్యాలిడిటీ ఇచ్చేది. రోజుకు 100 ఎస్సెమ్మెస్లు, 2జీబీ డేటా, అపరిమిత కాల్స్ అందించింది. ఫ్రీడమ్ 2.0 ప్లాన్లో భాగంగా తాజాగా ఈ ప్లాన్ వ్యాలిడిటీని 24 రోజులకు కుదించింది. రోజుకు 1జీబీ హైస్పీడ్ డేటాకే పరిమితం చేసింది. ఈ ప్లాన్ కొత్త వినియోగదారులకే... పాత బీఎస్ఎన్ఎల్ యూజర్లకు వర్తించదు.




## లోక్‌సభలో తొలిసారి వందేమాతరం ఆలాపన

### ఆరు చరణాల పూర్తి గేయాన్ని పాడిన ఎంపీలు

### గొంతు కలిపిన ప్రధాని మోడీ

**ఢిల్లీ, ఆగష్టు 13:** పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా జాతీయ గేయం 'వందేమాతరం'తో లోక్ సభకార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గురువారం ప్రధాని మోడీతో సహా సభ్యులంతా సభకు హాజరై వందేమాతరం ఆరు చరణాలను ఆలపించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్సభను నిరవధికంగా వాయిదా వేశారు. వందేమాతరాన్ని అవమానిస్తే క్రిమినల్ చర్యలు తీసుకునే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం.. వందేమాతరం పాడేటప్పుడు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటారు. దీంతో జాతీయ గీతం జనగణమనకు ఉన్న రక్షణ వందేమాతరానికీ లభించింది.

## 80 అంకె ఆకారంలో కూచుని

**తిరుపతి, ఆగష్టు 13:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తిరుపతిలోని ముత్యాల రెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, మరి కొంతమంది విద్యార్థులు 80 ఆకారంలో కూర్చొని పతాకానికి నేలను తాకుతూ నమస్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు సురేష్ అధ్యక్షతన విద్యార్థులు జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. అంకెల రూపంలో విద్యార్థుల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

# జర్నలిస్టులకు భద్రత టీయూడబ్ల్యూజే (ఐజేయు)తోనే సాధ్యం !





## జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించిన రాష్ట్ర అధ్యక్షుడు
## నియోజకవర్గం కమిటీల ఏర్పాటుపై హర్షం
## త్వరలో ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు

**హైదరాబాద్, ఆగష్టు 13(మనంన్యూస్):** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ( టీయూడబ్ల్యుజే- ఐజేయు) ద్వారానే జర్నలిస్టుల కు భద్రత సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తో ఇప్పటికే అనేక దఫాలుగా చర్చలు జరిగాయని, త్వరలో హెల్త్ కార్డు లు వస్తాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ, పటాన్ చేరు నియోజకవర్గం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. గజమాలతో , శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మహాసభను క్రమశిక్షణతో భారీ ఎత్తున నిర్వహించినందుకు జిల్లా కమిటీని అభినందించారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు బండారు యాదగిరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పటాన్చెరు నియోజకవర్గ కమిటీ ఏర్పాటుపై హర్షం వెలిబుచ్చారు. టి యు డబ్ల్యూ జె-ఐ జే యు మొక్కుబడి యూనియన్ కాదు అని, 70 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సంఘం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక సంఘం అని చెప్పారు. అక్రిడేషన్ కార్డులు ఇప్పటికే చాలా మందికి వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలో వస్తాయని చెప్పారు.అంతే కాకుండా అర్హులైన వారికి ఇంటి స్థలాలకు సంబంధించి త్వరలో ప్రభుత్వం ఒక పాలసీని తెస్తుందని తద్వారా అందరికీ ఇట్టి స్థలాలు వస్తాయని వివరించారు. పాత్రికేయులలో వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లా మహాసభను అందరి సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క రిపోర్టర్ కూడా తమ సొంత ఫంక్షన్ లాగా భావించి జిల్లా మహాసభకు తరలివచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల సంక్షేమానికి పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తామని చెప్పారు. పటాన్చెరు మాదిరిగానే జిల్లాలో ని మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతను సాధించడం ద్వారా హక్కులను పొందడమే తమ ముందున్న కర్తవ్యం అని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ సూచనలు సలహాలతో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ సంఘం తలపెట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయం చేసుకోవడం ద్వారా సంఘం కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర నాయకుడు బాసిత్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రతి విషయంలో టియుడబ్ల్యూజేఐజేయు అండగా నిలిచిందని అన్నారు. సంఘం పిలుపును పూచే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను సమిష్టిగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమాల వల్ల ప్రతి జర్నలిస్టుకు ఉత్సాహం కలుగుతోందని చెప్పారు. చిన్న మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు కూడా పోరాట పటిమ ను సాధించాలంటే టీయూడబ్ల్యూ జే ఐజేయు చరిత్ర తెలుసుకుంటే సరిపోతుందన్నా రు. అందరి సంక్షేమమే లక్ష్యంగా టియుడబ్ల్యూజే పని చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గం అధ్యక్షుడు పత్తి నరసింహ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు గర్వపడే విధంగా పటాన్చెరు నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా పాలువురు జర్నలిస్టులు జిల్లా అధ్యక్షుడు యాదగిరికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, , జిల్లా నాయకులు భూపాల్ రెడ్డి, హిమాయత్, పటాన్చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు.

# మీ కేసు ఎందుకు కొట్టివేయాలి?



## సివిల్ కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ
## ఫిలింనగర్ ఆస్తి వివాదం కేసులో దగ్గుబాటి హీరోలకు దడల్
## రానా, వెంకటేశ్‌లకు ఎదురుదెబ్బ
## సివిల్ వివాదంతో పాటు క్రిమినల్ కేసు కూడా కొనసాగవచ్చన్న హైకోర్టు
## కింది కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** సినీ నటులు వెంకటేశ్, రానా, దగ్గుబాటి అభిరామ్, నిర్మాత డి. సురేశ్ బాబులకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తమపై నమోదైన చోరీ, అతిక్రమణ కేసులను కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఆస్తికి సంబంధించిన సివిల్ వివాదం పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన, క్రిమినల్ కేసు విచారణను నిలిపివేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైదరాబాద్ ఫిలింనగర్ డక్కన్ కిచెన్ రెస్టారెంట్ ఆస్తికి సంబంధించి వ్యాపారవేత్త కోరె నందుకుమార్ ఈ కేసు దాఖలు చేశారు. తాను లీజుకు తీసుకున్న స్థలంలోని నిర్మాణాలను నిందితులు అక్రమంగా కూల్చివేశారని, చట్టవిరుద్ధంగా ప్రాంగణంలోకి ప్రవేశించి విలువైన వస్తువులను అపహరించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను, తన కుటుంబాన్ని బెదిరించడమే కాకుండా, కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ నిందితులు వాటిని బేఖాతరు చేశారని ఆరోపించారు.

ఈ వివాదం పూర్తిగా సివిల్ వ్యవహారమని, దీనిపై క్రిమినల్ విచారణ జరపడం సరికాదని దగ్గుబాటి కుటుంబ సభ్యులు, వారి అకౌంటెంట్ గడ్డం విశ్వనాథం హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ వాదనతో జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం ఏకీభవించలేదు?. ఒకే వివాదంలో సివిల్, క్రిమినల్ అంశాలు మిళితమై ఉండవచ్చని, నేరపూరిత చర్యలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు విచారణను అడ్డుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఇక్కడ ప్రధానంగా ఫిర్యాదు, వాంగ్మూలాలు, ఫోటోలు, వీడియో సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కింది కోర్టు మెజిస్ట్రేట్ ఈ కేసును విచారణకు స్వీకరించారని హైకోర్టు అభిప్రాయపడింది. లోతైన విచారణ ద్వారానే వాస్తవాలను తేల్చాల్సి ఉంటుందని, ప్రాథమిక దశలో సెక్షన్ 482 కింద కేసును కొట్టివేయలేమని వెల్లడించింది. ఈ తీర్పుతో నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు విచారణ యధావిధిగా కొనసాగనుంది.

# ఖేలో ఇండియా క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం

## కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో తెలంగాణ ప్రతినిధుల భేటీ



**న్యూఢిల్లీ, ఆగష్టు 13,:** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని మంత్రి ఉద్ఘాటించారు.

# పకడ్బందీగా పంద్రాగస్టు ఏర్పాట్లు

## అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
## విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి
## శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేసిన రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్





**హైదరాబాద్,అగష్టు13(మనం న్యూస్):** పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పంద్రాగస్టు రోజున ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం, యూనిటీ మార్పుపై విచారణ జరపండి

## ప్రజలను దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ పడుతున్నయ్?
## కాంగ్రెస్ తప్పులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాల్సిందే
## కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ధ్వజం



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే పరిమితం కాకుండా, డీపీఆర్ తయారీ నుంచి ముగింపు చెల్లింపుల వరకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ముందుండా తానే స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ ముందుకు సాగేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న 'యూనిటీ మాల్' ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపైనా విచారణ జరగాలని రఘునందన్ రావు అన్నారు. గతంలో కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిపినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ తప్పులపైనా దర్యాప్తు ఎందుకు ఉండకూడదని రఘునందన్ ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపుతో పాటు ప్రస్తుత యూనిటీ మాల్ ఒప్పందంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని, అవి కేవలం కస్టోడియన్లుగా మాత్రమే ఉండాలని ఎంపీ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని, అవినీతిలో ఈ రెండూ ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్న అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం వంటి విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మారుస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించిన ఆయన, ఈ దోపిడీకి ముగింపు పలకాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ఎంపీ రఘునందన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# వందే ప్రజ ఆధ్వర్యంలో ఇండిపెండెన్స్ ర్యాలీ

## పాల్గొన్న ఓమా టైక్వాండో అకాడమీ, ట్రైనీస్





**హైదరాబాద్, ఆగష్టు 13 :** నిత్య జనగణమన కేంద్రంలో పంద్రాగస్టు వేడుకలకు గురువారం శ్రీకారం చుట్టారు. మొదటిరోజు ఉత్సవాల్లో భాగంగా ఇటీవలే ప్రపంచ గిన్నిస్ రికార్డు సాధించిన నల్లకుంట పద్మ కాలనీలోని ఓమా టైక్వాండో అకాడమీకి చెందిన 5- 14 సంవత్సరాల వయస్సున్న 50 మందికి పైగా ట్రైనీస్ తో సహా నేటి పతాకావిష్కరణ కార్యక్రమానికి ర్యాలీగా విచ్చేశారు. వారి శిక్షణ కేంద్రమైన పద్మ కాలనీ నుంచి టైక్వాండో శిక్షకులు, శిక్షణార్థులు జెండా కేంద్రం వరకు పతాక ప్రదర్శన చేశారు. ఓమా అకాడమీ డైరెక్టర్ పచ్చి పులుసు ఆంజనేయులు, కోచ్ గౌరీ శంకర్, శిక్షకులు సత్యప్రసాద్, సుధాకర్ ర్యాలీకి సారథ్యం వహించారు. కాగా, నిత్య జనగణ మన నిర్వాహక సంస్థ వందే ప్రజ ప్రతినిధులు ఎం.కే. శ్రీనివాస్, బట్టు రమాదేవి ర్యాలీని తోడుకొని వచ్చారు. జిల్లా కేంద్రం వద్ద ర్యాలీకి నిత్య జనగణమన ఫౌండింగ్ ఆర్గనైజర్ నేలంటి మధు స్వాగతం పలికారు. ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, టైక్వాండో ట్రైనీస్ ప్రదర్శన ఆద్యంతం దేశభక్తి, జాతీయపతాక, సార్వభౌమత్వ నినాదాలు చేశారు. ఈ నినాదాలు పద్మ కాలనీ నుంచి జెండా కేంద్రం వరకు దిక్కులను పిక్కటిల్లజేశాయి. ఈ జెండా ర్యాలీని దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా గమనించారు. బాటసారులు, దుకాణదారులు స్పందనగా జెండాకు వందనం చేయడం విశేషం. జెండా కేంద్రం వద్ద ఎంకే శ్రీనివాస్ వందేమాతర గీతం ఆలపించారు. తరువాత కోచ్ గౌరీ శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అందరూ కలిసి జాతీయ గీతం జనగణమన ను కోరస్ గా ఆలపించారు. ఈ విధంగా వందే ప్రజా నిర్వహిస్తున్న పంద్రాగస్టు వేడుకల్లో తొలి రోజు కార్యక్రమం ప్రజల కరతాళ ధ్వనుల మధ్య విజయవంతంగా కొనసాగింది.

# ముగిసిన ఆషాడ బోనాలు

## దేవాదాయ శాఖ మంత్రి కొండా



**హైదరాబాద్,ఆగష్టు 13(మనం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో విజయవంతంగా ముగిసిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గత నెల 16న గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభమైన బోనాల మహోత్సవం, తిరిగి గురువారం జగదాంబిక అమ్మవారికి మహాకుంభహారతితో సంప్రదాయబద్ధంగా ముగిసిందని మంత్రి స్పష్టం చేశారు. దాదాపు నెలరోజుల పాటు వైభవోపేతంగా జరిగిన బోనాల వేడుకలు శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, జానపద కళల ప్రదర్శన, అంబారీల ఊరేగింపు, రంగం, ఘటోత్సవాలతో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ ఘనంగా జరిగాయని మంత్రి పేర్కొన్నారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. రూ. 20 కోట్ల నిధులతో ఆషాడ బోనాల జాతరను దేదీప్యమానంగా నిర్వహించామని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వేలాది ఆలయాల్లో జరిగిన బోనాల వేడుకలు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా జరిగేందుకు పోలీసులు, జిహెచ్ఎంసి, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్యారోగ్యం, ట్రాఫిక్ నియంత్రణ, జలమండలి తదితర శాఖలతో సమన్వయంతో పనిచేసి జాతరను నిర్వహించిన తీరు అద్భుతమని మంత్రి సురేఖ అన్నారు. అన్ని శాఖల అధికారులకు ఈ సందర్భంగా పేరుపేరునా మంత్రి సురేఖ అభినందనలు తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థలు అందించిన సహకారం కూడా మరువలేనిదని మంత్రి అన్నారు.

**భిన్నత్వంలో ఏకత్వం:**

హైదరాబాద్ బోనాలు తెలంగాణ సమాజంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్నాయని, గంగా జమునా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తూ యావత్ దేశానికి లౌకిక సందేశాన్నిస్తున్నాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం హైదరాబాద్ నగర ప్రత్యేకతను మరోసారి ప్రపంచానికి చాటిందని అన్నారు. అమ్మవారి చల్లని చూపు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలి. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని మంత్రి అభిలాషించారు.

అమ్మవార్ల దయతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని,శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక సామరస్యం మరింత బలపడాలి అని మంత్రి సురేఖ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ తరపున నిర్వహించిన వరుణయాగంతో ప్రభుత్వ సంకల్పం సిద్ధించి, రాష్ట్రం ఎల్ నినో ప్రభావం నుంచి తేరుకుని, వర్షాలు పడుతుండటం అమ్మవార్ల మహిమేనని మంత్రి సురేఖ ఈ సందర్భంగా తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మంత్రి సురేఖ కోరుకున్నారు.

## నేను నేనుగా ఎప్పుడు బతికాను

నా బంధనాలు తెంపుకొని
బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా
తిరగాలనుకున్నప్పుడు
నన్ను బందెల దొడ్డిలో బంధించి
పారిపోకుండా ఉండడానికి
పసగడ అడ్డంపెట్టింది మీరు

నేను చెంగుచెంగు మంటూ
లేగ దూడలా గంతేయాలని
పచ్చిక బయల్లల్లో పరుగు
తీయాలని మనసు పడ్డప్పుడు
నా కాళ్ళలో లెంకపేట కట్టి
నా నడకకు అడ్డం తగిలింది మీరు

నా హక్కులను రక్షించమంటూ
వేడుకున్నప్పుడల్లా నన్ను
సాంప్రదాయపు చెరసాలలో బంధించి
కర్మ సిద్ధాంతం గోడల్లో కట్టిపడేసి
సనాతన ధర్మపు సమాధుల మధ్య
ప్రాణంతో పాతర వేసింది మీరు.

నా అడుగు అడుగుకు హద్దులు గీసి
నా జీవితాన్ని ఒక చట్రంలో బంధించి
నా ప్రతి కదలికకు రూపకల్పన చేసి

అదే జీవితమని నన్ను నమ్మించి
నన్ను నన్నుగా జీవించకుండా చేసింది మీరు

ఎంతకాలం నా ఓపికను కట్టేయగలరు
ఎప్పుడో ఒక రోజు చెరువు కట్ట తెగినట్టుగా
లావాల పొంగి పారినట్టుగా పారుతూ
నిన్ను నిండా ముంచే ఒక రోజు వస్తుంది
అంత వరకే మీ ఆగడాలు.

**- నెరువట్ల చైతన్య**
9491470746

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# భారత విభజన పూర్వాపరాలు.. విశ్లేషణ

భారతదేశ చరిత్రలో 1947 ఆగస్టు 15వ తేదీ ఒకవైపు శతాబ్దాల పారతంత్ర పరిమోచనకు, స్వరాజ్య ఆవిర్భావానికి ప్రాతిపదికగా నిలిస్తే, మరొకవైపు కోట్లాది మంది గుండెల్లో శాశ్వత గాయాన్ని మిగిల్చిన తీవ్ర విషాదానికి వేదికైంది. భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు శతాబ్దాలుగా సహజీవనం చేసిన ప్రాచీన భరతఖండం, రాజకీయ నిర్ణయాలు మరియు మత రాజకీయాల ఫలితంగా భారత్, పాకిస్థాన్ అనే రెండు వేర్వేరు సార్వభౌమ రాజ్యాలుగా చీలి పోయింది. స్వాతంత్ర్యోదయం సంబరాలను తెస్తే, విభజన ప్రక్రియ లక్షలాది కుటుంబాల జీవితాలను ధ్వంసం చేసింది. అందుకే భారత విభజనను కేవలం రెండు సరిహద్దుల రేఖల మార్పుగా కాకుండా వలస పాలనలోని వ్యూహాలు, నాయకత్వ వైఫల్యాలు, అధికార పోరాటాలు, తీవ్ర సామాజిక భయాలు కలగలిసి రూపుదిద్దుకున్న సంక్లిష్ట మానవ విపత్తుగా విశ్లేషించాల్సి ఉంటుంది.

ఈ విభజన బీజాలు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, తదనంతరం 1858లో బ్రిటిష్ కిరీట పాలన ప్రత్యక్షంగా ప్రారంభమైన తరుణంలోనే పడ్డాయి. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూ-ముస్లింలు కలసి కట్టుగా పోరాడటాన్ని చూసి భయపడిన ఆంగ్లేయ పాలకులు, తమ సామ్రాజ్య పునాదులను పటిష్ఠం చేసుకోవడానికి 'విభజించి పాలించు' (Divide and Rule) విధానాన్ని ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. 1905 నాటి బెంగాల్ విభజన దీనికి తొలి ఉదాహరణ కాగా, 1906లో అఖిల భారత ముస్లిం లీగ్ ఆవిర్భావం ఈ పరిణామాలకు మరింత వేగాన్ని ఇచ్చింది. ఆపై 1909 నాటి మింటో-మార్లీ సంస్కరణలు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను (Separate Electorates) కేటాయించడం ద్వారా మత ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యాన్ని అధికారికంగా సంస్థాగతీకరించాయి. ఇది భారతీయ సమాజంలో మతపరమైన వేర్పాటువాద ఆలోచనలకు బీజం వేసింది.

కాలక్రమేణా ముస్లిం లీగ్ ప్రత్యేక మత రాజకీయ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. 1930లో అలహాబాద్‌లో జరిగిన ముస్లిం లీగ్ సమావేశంలో ప్రముఖ కవి, తత్త్వవేత్త అల్లామా మహమ్మద్ ఇక్బాల్ వాయువ్య ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థ ఉండాలనే ఆలోచనను తొలిసారిగా ప్రతిపాదించారు. 1933లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యార్థి చౌధరి రహ్మత్ అలీ 'పాకిస్థాన్' (పంజాబ్, ఆఫ్ఘనిస్థాన్, కాశ్మీర్, సింధ్, బలూచిస్థాన్‌ల సంక్షిప్త రూపం) అనే నామకరణాన్ని ప్రచారంలోకి తెచ్చారు. మహమ్మద్ అలీ జిన్నా నాయకత్వంలో ముస్లింలీగ్ 'ద్విజాతి సిద్ధాంతాన్ని' (Two& Nation Theory) తీవ్రంగా ప్రచారం చేసింది. హిందువులు, ముస్లింలు కేవలం వేర్వేరు మతాలకు చెందినవారు మాత్రమే కాకుండా, వారి సంస్కృతి, సామాజిక విలువలు, జీవన విధానాలు పూర్తిగా భిన్నమైనవని, కాబట్టి వారు ఒకే దేశంగా



మనుగడ సాగించలేరని జిన్నా వాదించారు. 1940 మార్చి 23న లాహోర్ సమావేశంలో ముస్లిం లీగ్ చేసిన 'లాహోర్ తీర్మానం' ప్రత్యేక పాకిస్థాన్ డిమాండ్‌కు అధికారిక పునాదిగా మారింది.

రెండవ ప్రపంచ యుద్ధం తదనంతర పరిణామాలు అధికార మార్పిడిని అనివార్యం చేశాయి. 1942 నాటి క్రిప్స్ రాయబారం, 1945 నాటి సిమ్లా సదస్సు, 1946 నాటి క్యాబినెట్ మిషన్ వంటివి భారత ఐక్యతను కాపాడుతూ అధికార బదిలీకి మార్గాలు అన్వేషించాయి. క్యాబినెట్ మిషన్ కేంద్రానికి పరిమిత అధికారాలు ఇస్తూ, రాష్ట్రాలను మూడు గ్రూపులుగా విభజించే సమాఖ్య నమూనాను ప్రతిపాదించింది. ప్రారంభంలో కాంగ్రెస్, ముస్లిం లీగ్ దీనికి సూత్రప్రాయంగా అంగీకరించినా, కేంద్ర ప్రభుత్వం యొక్క అధికార పరిధి మరియు రాష్ట్రాల ప్రాధాన్యతలపై జవహర్లాల్ నెహ్రూ, జిన్నాల మధ్య కుదరని ఏకాభిప్రాయం వల్ల ఈ ప్రణాళిక విఫలమైంది.

క్యాబినెట్ మిషన్ వైఫల్యంతో తీవ్ర నిరాశకు గురైన జిన్నా, 1946 ఆగస్టు 16ను 'ప్రత్యక్ష కార్యాచరణ దినం'గా (Direct Actionday) ప్రకటించారు. ఇది కలకత్తాలో భయానక మతకల్లోలాలకు దారితీసింది. 'గ్రేట్ కలకత్తా కిల్లింగ్స్'గా చరిత్రలో నిలిచిన ఈ హింసలో కొద్ది రోజుల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మతచిచ్చు త్వరలోనే తూర్పు బెంగాల్‌లోని నోయాఖలి, బిహార్, పంజాబ్, రేవల్పిండి ప్రాంతాలకు దావానలంలా వ్యాపించింది. గ్రామాలకు గ్రామాలు తగలబడి పోయాయి. ఈ రక్తపాతం సమాజంలో పరస్పర విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీసింది, విభజన తప్ప వేరే మార్గం లేదనే వాతావరణాన్ని సృష్టించింది.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న పార్లమెంట్‌లో మాట్లాడుతూ, 1948 జూన్ లోపు ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలివెళ్తారని, అధికార బదిలీ పూర్తి చేస్తారని ప్రకటించారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చివరి వైస్రాయ్‌గా వచ్చిన లార్డ్ మౌంట్‌బాటన్ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. 1947 జూన్ 3న 'మౌంట్‌బాటన్ ప్రణాళిక' విడుదల కాగా, బ్రిటిష్ పార్లమెంట్ 'భారత స్వాతంత్ర్య చట్టం 1947'ను ఆమోదించింది. దీంతో భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన దేశాల ఆవిర్భావానికి చట్టబద్ధత లభించింది.

అయితే సరిహద్దుల నిర్దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చారిత్రక పొరపాటు మానవాళికి తీరని శోకాన్ని మిగిల్చింది. బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల విభజన బాధ్యతను అప్పగించారు. భారతదేశ భౌగోళిక, సాంస్కృతిక, జనాభా సంక్లిష్టతలపై ఎటువంటి ప్రాథమిక అవగాహన లేని రాడ్‌క్లిఫ్, కేవలం పాత జనాభా లెక్కల ఆధారంగా నదులు, కాలువలు, గ్రామాలు, చివరకు ఇళ్లను కూడా రెండుగా విభజిస్తూ సరిహద్దు రేఖను గీశారు. అత్యంత దారుణమైన విషయమేమిటంటే, ఈ సరిహద్దు వివరాలను ఆగస్టు 15న కాకుండా, స్వాతంత్ర్యం వచ్చిన రెండు రోజుల తర్వాత, అంటే 1947 ఆగస్టు 17న ప్రకటించారు. తాము ఏ దేశంలో ఉన్నామో తెలియక లక్షలాది మంది ప్రజలు తీవ్రమైన అనిశ్చితికి, భయాందోళనలకు గురయ్యారు.

1947 ఆగస్టు 14న పాకిస్థాన్, ఆగస్టు 15న భారతదేశం అవతరించాయి. కానీ సరిహద్దుల ప్రకటన వెలువడగానే ప్రపంచ మానవ చరిత్రలోనే అతిపెద్ద బలవంతపు జనాభా మార్పిడి (Mass Migration) సంభవించింది. తమ శతాబ్దాల నాటి ఆస్తులను, ఇళ్లను, పూర్వీకుల జ్ఞాపకాలను వదిలేసి హిందువులు, సిక్కులు భారత్‌కు, ముస్లింలు పాకిస్థాన్‌కు కాలినడకన, ఎడ్ల బండ్లపై, కిక్కిరిసిన రైళ్లలో ప్రయాణించారు. దాదాపు 1.4 కోట్ల నుంచి 1.6 కోట్ల మంది ప్రజలు తమ పురిటిగడ్డను వదిలి అభయారణ్యం కోసం సరిహద్దులు దాటారు. ఈ వలసల బాటలో చెలరేగిన మత హింసలో 5 లక్షల నుంచి 10 లక్షల మంది దారుణంగా హత్యకు గురయ్యారు. వేలాది మంది మహిళలపై లైంగిక దాడులు, అపహరణలు జరిగాయి. పంజాబ్, బెంగాల్లలో ప్రవహించిన నదులు, ప్రయాణించిన రైళ్లు శవాల దిబ్బలుగా మారాయి.

విభజన అనంతర పరిణామాలు నవభారతానికి, నూతన పాకిస్థాన్‌కు తీవ్ర సవాళ్లను విసిరాయి. ఢిల్లీ, అమృత్సర్, లాహోర్, కలకత్తా, కరాచీ వంటి నగరాలు లక్షలాది మంది శరణార్థులతో నిండిపోయాయి. పునరావాసం కల్పించడం స్వతంత్ర భారత ప్రభుత్వానికి తొలి ప్రధాన పరీక్షగా మారింది. ఆస్తుల పంపిణీ, సైనిక బలగాల విభజన, నదీ జలాల పంపిణీ వంటి ఆర్థిక పరిపరిణామాలతో పాటు, ప్రిన్స్‌లీ స్టేట్స్ (సంస్థానాలు) విలీనం సరికొత్త వివాదాలకు దారితీసింది. ముఖ్యంగా జమ్మూ-కాశ్మీర్ సంస్థానం భారత్‌లో విలీనమైన క్రమంలో 1947లో సంభవించిన మొదటి ఇండో-పాక్ యుద్ధం ఇరు దేశాల మధ్య శాశ్వత శత్రుత్వానికి పునాది వేసింది.

ఈ విశ్లేషణ ద్వారా తేలేదేమిటంటే, భారత విభజన అనేది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక రాజకీయ పార్టీ నిర్ణయం కాదు. బ్రిటిష్ వలస పాలనా వ్యూహాలు, శతాబ్దాల సహజీవనంలో చోటుచేసుకున్న మత రాజకీయాల విద్వేషాలు, కాంగ్రెస్-ముస్లిం లీగ్‌ల మధ్య పవర్ షేరింగ్ వైఫల్యాలు, అధికారాన్ని త్వరగా బదిలీ చేయాలనే బ్రిటిష్ తొందరపాటుల సమ్మేళనం. మహాత్మా గాంధీ అంతిమ ఘడియ వరకు దేశ ఐక్యత కోసం, మత సామరస్యం కోసం శ్రమించినప్పటికీ, రగులుతున్న హింసాజ్వాలల ముందు ఆ ప్రయత్నాలు నెరవేరలేకపోయాయి. నెహ్రూ, పటేల్, జిన్నా వంటి నేతలు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తీవ్రమైన రాజీ మార్గాలను ఎంచుకోవాల్సి వచ్చింది.

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'అన్న గురజాడ అప్పారావు వాక్కులు విభజన విషాదాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ దిక్సూచిగా నిలుస్తాయి. గతాన్ని నిందించడం కాకుండా, చరిత్రలోని లోటుపాట్లను అర్థం చేసుకుంటూ, జాతి రక్షణకు, సామాజిక ఐక్యతకు, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉండటమే ఆ విభజన బాధితులకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# అణు ఒప్పందం.. కొత్త 'సమీకరణాలకు'నాంది



అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు; శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. అమెరికా-సౌదీ అరేబియా మధ్య కుదిరిన పౌర అణుశక్తి సహకార ఒప్పందం ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టంగా చాటుతోంది. ఉపరితలంపై ఇది శాంతియుత అణుశక్తి వినియోగానికి సంబంధించిన ఒప్పందంలా కనిపించినా, దాని అంతరార్థం పశ్చిమాసియాలో శక్తి సమతుల్యతను అమెరికాకు అనుకూలంగా పునర్నిర్మించడం. ఇది కేవలం రియాద్‌కు అణు సాంకేతికత బదిలీ కాదు. ఇరాన్‌ను నియంత్రించడం, చైనా వ్యూహాత్మక చొరబాటును అడ్డుకోవడం, రష్యా ప్రభావాన్ని పరిమితం చేయడం, అమెరికా ఆధ్వర్యంలోని ప్రాంతీయ భద్రతా వ్యవస్థను పునరుద్ధరించడం వంటి బహుళ లక్ష్యాల సమ్మేళనం.

అంతర్జాతీయ సంబంధాల ప్రముఖ సిద్ధాంతకర్త హెన్రీ కిసింజర్ ప్రతిపాదించిన 'బ్యాలెన్స్ ఆఫ్ పవర్' భావన ప్రకారం, ఒక ప్రాంతంలో ఏ ఒక్క దేశం అత్యంత బలంగా మారకుండా ప్రత్యర్థి శక్తులను సమతుల్యం చేయడం ద్వారానే స్థిరత్వం సాధ్యమవుతుంది. ప్రస్తుతం అమెరికా అదే సిద్ధాంతాన్ని పశ్చిమాసియాలో అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమం, దాని క్షిపణి సామర్థ్యం, హెజ్బొల్లా, హౌతీలు, హష్ద్ అల్-షాబీ వంటి మిత్ర బలగాల ద్వారా విస్తరిస్తున్న ప్రభావం నేపథ్యంలో సౌదీని వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది.

ప్రపంచ ఆధిపత్యం కొనసాగాలంటే కీలక భౌగోళిక ప్రాంతాల్లో మిత్రదేశాలను బలోపేతం చేయాలనే సిద్ధాంతం ప్రకారం అమెరికా ఇప్పుడు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాలను ఎలా బలోపేతం చేస్తోందో, పశ్చిమాసియాలో అదే పాత్రను సౌదీకి అప్పగించాలని చూస్తోంది. ఈ పరిణామంలో చైనా పాత్ర అత్యంత కీలకం. 2023లో బీజింగ్ మధ్యవర్తిత్వంతో సౌదీ-ఇరాన్ సంబంధాలు పునరుద్ధరించబడటం అమెరికాకు దౌత్యపరమైన ఎదురుదెబ్బ. బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం ద్వారా చైనా



గల్ఫ్ దేశాల్లో భారీ పెట్టుబడులు పెడుతోంది. సౌదీ కూడా చైనాతో ఇంధనం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించింది. ఈ పరిస్థితిలో అణు సహకారాన్ని అమెరికా ఒక వ్యూహాత్మక 'ఆంకర్'గా ఉపయోగిస్తోంది. అంటే, సౌదీ భద్రత అమెరికాతోనే ముడిపడి ఉండేలా చేయడమే లక్ష్యం.

రష్యా కోణం కూడా అంతే ప్రాధాన్యమైనది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా పశ్చిమ ఆంక్షలను ఎదుర్కొంటూ గల్ఫ్ దేశాలతో ఇంధన సహకారాన్ని బలోపేతం చేసింది. ఒపెక్(ఒపిఈసీ)+ వేదికపై సౌదీ-రష్యా సమన్వయం అమెరికాను అసౌకర్యానికి గురి చేసింది. అణు సహకారం ద్వారా ఆ వ్యూహాత్మక దూరాన్ని తగ్గించాలని వాషింగ్టన్ భావిస్తోంది.

ఇరాన్‌కు ఈ ఒప్పందం కేవలం దౌత్యపరమైన సవాలు కాదు. భద్రతాపరమైన హెచ్చరిక కూడా. సౌదీకి ప్రస్తుతం పౌర అణు సాంకేతికత లభించినా, భవిష్యత్తులో అది యురేనియం శుద్ధీకరణ సామర్థ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తుందేమో అన్న అనుమానం టెహ్రాన్‌లో సహజంగానే ఉంటుంది. దానికి ప్రతిస్పందనగా ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాంతీయ ఆయుధ పోటీ మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇజ్రాయిల్ స్పందన ద్వంద్వ స్వభావంతో ఉంటుంది. ఇరాన్‌ను ఎదుర్కొనే విషయంలో బలమైన సౌదీ తనకు ఉపయోగపడుతుంది. కానీ అణు సాంకేతికత కలిగిన సౌదీ, దీర్ఘకాలంలో ప్రాంతీయ అణు సమీకరణాలను మార్చే అవకాశాన్ని కూడా ఇజ్రాయిల్ నిర్లక్ష్యం చేయదు. అందువల్ల అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణ, కఠిన తనిఖీలు, యురేనియం శుద్ధీకరణపై పరిమితులు వంటి అంశాలపై అది పట్టుబట్టే అవకాశముంది. మిగతా అరబ్ ప్రపంచం కూడా ఈ పరిణామాన్ని అవకాశంగా చూస్తోంది. ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పౌర అణు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సౌదీకి లభించే ప్రత్యేక హోదా తమకూ వర్తించాలని ఖతర్, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాలు కోరే అవకాశం ఉంది. ఇది పశ్చిమాసియాలో పౌర అణుశక్తి విస్తరణకు దారితీస్తుంది. అయితే అదే సమయంలో అణు వ్యాప్తి నిరోధక వ్యవస్థపై కొత్త ప్రశ్నలను కూడా లేవనెత్తుతుంది.

భారత్‌కు ఈ పరిణామం ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. భారత ఇంధన దిగుమతుల్లో గల్ఫ్ దేశాల వాటా గణనీయమైనది. అంతేకాదు, అక్కడ పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత, భారత వాణిజ్య మార్గాలు, సముద్ర భద్రత-అన్నీ పశ్చిమాసియా స్థిరత్వంతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి భారత్ అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే, సౌదీ, ఇరాన్, ఇజ్రాయిల్లతో మంచి సంబంధాలను కొనసాగించడం అత్యవసరం.

ఈ పరిణామం చివరకు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెస్తోంది. అమెరికా రూపొందిస్తున్న ఈ కొత్త ప్రాంతీయ వ్యవస్థ నిజంగా శాంతి, స్థిరత్వాన్ని తీసుకువస్తుందా? లేక ప్రచ్ఛన్న యుద్ధ కాలంలా మరోసారి ప్రత్యర్థి కూటములు, ఆయుధ పోటీ, పరస్పర అనుమానాలకు దారి తీస్తుందా? చరిత్ర చెబుతున్న ఒక పాఠం ఏమిటంటే-శక్తి సమతుల్యత శాంతిని కాపాడగలదు. కానీ అదే సమతుల్యత ఆయుధ పోటీపై ఆధారపడితే, శాంతి ఎప్పుడైనా సంక్షోభంలో పడిపోవచ్చు. అందువల్ల అమెరికా-సౌదీ అణు ఒప్పందం ఇప్పుడు పశ్చిమాసియాను అలాంటి చారిత్రక కూడలిలో నిలబెట్టింది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# ఆంధ్ర రైజింగ్ స్టార్ నారా లోకేష్



'ఫార్చ్యూన్ ఇండియా' అనే ఆంగ్ల పత్రిక ఇచ్చిన 'ఆంధ్ర రైజింగ్ స్టార్' గుర్తింపు యువనాయకుడు ఆంధ్ర ప్రజల ఆశా కిరణం విద్య శాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో ఫలితాలుగా మార్చడం, పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ పరిశ్రమలుగా మారి యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ, ముందుకు సాగుతున్న లోకేష్‌కు లభించిన ఓ గౌరవంగా భావించాలి. రాజకీయాల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమే. ఆ మెట్టుపై నిలబడి గమ్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన శ్రమ, పట్టుదల ఉంటేనే చరిత్ర గుర్తిస్తుంది. అనతి కాలంలోనే రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు సాధించిన నాయకులు బహు అరుదుగా కనిపిస్తారు. అయితే రాష్ట్ర ఐటి, మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగు దేశం పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఆ కోవకే చెందుతారు. ఇదే విషయాన్ని 'ఫార్చ్యూన్ ఇండియా' తన ఆగస్టు సంచికలో స్పష్టంచేసింది.



'ఆంధ్రాస్ రైజింగ్ స్టార్ హా నారా లోకేష్' అంటూ మంత్రి ,యువనేత నారా లోకేష్‌ను ప్రశంసిస్తూ ప్రచురించిన కథనం తెలుగు ప్రజలకు దక్కిన గౌరవం. 40 అండర్ 40 విభాగంలో లోకేష్‌ను కీలకనాయకుడిగా పేర్కొనడాన్ని చూస్తే ఆయనను తెలుగు ప్రజల ఆశాకిరణంగా అభివర్ణించవచ్చు.

యువగళం నాయకుడిగానే కాకుండా మంత్రి పనితీరుతో ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడి ఇమేజ్‌కు లోకేష్ పరిమితం కాలేదు. రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త 'టెక్నో-పొలిటికల్' శకానికి ఆయన దారులు వేశారనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత లోకేష్ చేపడుతున్న విధి విధానాలు తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలుకుతున్నాయి. ఐటి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన క్షణం నుంచి నారా లోకేష్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. గూగుల్ ప్రాజెక్టు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ , పునరుత్పాదక ఇంధనం, ఆటోమోటివ్ రంగాల్లో విదేశీ, స్వదేశీ దిగ్గజ సంస్థల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఇండస్ట్రియల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని ఫార్చ్యూన్ ఇండియా కథనం ప్రస్తుతించింది. యువగళం పాదయాత్ర ద్వారానే లోకేష్ ప్రజా నాయకుడిగా ఎదిగి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. లోకేష్ నేటి 'జెన్-జీ' యువతతో మమేకమవుతున్నారు. వారసత్వం దాటి సొంత ముద్ర దిశగా అడుగులు వేస్తూ పరిణితి చెందిన నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆశిద్దాం.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి,ఆంధ్రప్రదేశ్

# భారతీయ వీరనారి అహల్యాబాయి హోల్కర్



అహల్యాబాయి హోల్కర్ ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అహల్యానగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల - మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది. తల్లి తండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబర కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హార్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో వారికి మలేరావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు.

1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీసహగమనం చేయడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ మల్హార్ రావు ఒప్పించి తన కోడలిని కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజనీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడం జరిగింది. 1766లో మామ గారైన మల్హార్ రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీలను రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ లాంటి సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకరించడం విశేషం.

అహల్యాబాయి మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం, పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్య స్థాపన చేసిన అహల్యాబాయి ప్రజల ఆరాధ్య దైవంగా మారింది. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంతవాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడం అహల్యాబాయి మహారాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు, ధర్మశాలలు, హిందూ దేవాలయాలు, విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం, నేటి మధ్యప్రదేశ్‌లో)ను నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రయంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మథుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బద్రీనాథ్, కేగార్నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది.

శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. 1780లో కాశీ ఆల యాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను సహితం స్థాపించడం జరిగింది. 13 ఆగష్టు 1795న అహల్యాబాయి హోల్కర్ మహారాణి మరణించడంతో మల్హార్ రావు దత్తపుత్రుడు తుకోజీ



రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహా సనం వదులుకున్నారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయిన చివరి హోల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు.

మహారాణి అహల్యాబాయి హోల్కర్ బహుముఖ ప్రజ్ఞకు గుర్తుగా ఇండోర్ విమానాశ్రయానికి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంగా, ఇండోర్‌లో అహల్యాబాయి యూనివర్సిటీగా, సోలాపూర్‌లోని విశ్వవిద్యాలయానికి పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ యూనివర్సిటీగా పేరు పెట్టడం జరిగింది. పాలనలో దాతృత్వం, సామాజిక సంస్కరణలు, కళలు, సంస్కృతికి మద్దతుగా నిలిచిన అహల్యాబాయి నేటి ఇండోర్ నగర అభివృద్ధికి నాడే పటిష్ట బీజాలు నాటారు.

వితంతువులకు ఆస్తి హక్కు, మహిళా సాధి కారతలకు పెద్ద పీట వేశారు. రాజమాత అహల్యాదేవి హోల్కర్ గా ప్రసిద్ధి గాంచి భారత స్వాతంత్ర్యానికి ముందు అత్యంత శక్తివంతమైన మహిళగా రుజువు చేసుకున్నారు. తత్వవేత్తగా, మహారాణిగా, సమర్థురాలైన పాలకురాలిగా,సాహసోపేత నాయకురాలిగా కీర్తించ బడ్డారు. అహల్యాబాయి 300వ వర్ధంతి సందర్భంగా నేటి యువత, ముఖ్యంగా యువతులు ఆమె జీవిత చరిత్రను ఆక ళింపు చేసుకొని ఆమె బాటలో పయనించాలని కోరుకుందాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# వెరీ గుడ్.. వెల్డన్ బ్రదర్స్

**టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ**

**కనీవినీ ఎరుగని రీతిలో పటాన్ చెరు సమావేశం**

**పటాన్ చెరు జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనం**

**త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిద్దాం**

**విరాహత్ ఆలీని మర్యాదపూర్వకంగా కలిసిన పటాన్ చెరు నూతన కార్యవర్గం**





**పటాన్ చెరు, ఆగస్టు 13(మనం న్యూస్) :** టీయూడబ్ల్యూజే-ఐజేయూ పటాన్చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీని గురువారం హైదరాబాద్ బషీర్బాగ్లోని యూనియన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన,పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ప్రశంసించారు. సంఘం పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా కార్యవర్గం పనిచేసిందని కొనియాడారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంఘానికి 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని పేర్కొన్న ఆయన, క్రమశిక్షణకు మారుపేరైన ఈ సంఘంలో ప్రతి జర్నలిస్టు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవి అనేది అధికారం కాదని, అది ఒక బాధ్యత మాత్రమేనని అన్నారు. అహంకారానికి దూరంగా ఉండి సేవాభావంతో పనిచేసినప్పుడే పదవికి గౌరవం లభిస్తుందని తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని పటాన్‌చెరులో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందుకు స్థానిక కార్యవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్చెరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ప్రాంతం ప్రత్యేక అనుభూతి కలిగి ఉందని, ఆ ప్రాముఖ్యతను మరింత పెంచేలా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. యూనియన్ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి ఒక్కరిని నాయకత్వం గుర్తిస్తుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని విరహత్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న బసవేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, చిన్న, మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్,పటాన్చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు శివకుమార్, శ్రీనివాస్,కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి,ఈసీ మెంబర్లు శేఖర్, సిద్ధు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన పెన్షన్ల కోసం 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్ల అందిస్తాం**
- **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల, ఆగస్టు 13 ( మనం ప్రతినిధి ):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల పంపిణీ పై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్లైన్లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.47 కోట్ల మేర పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అందుతున్న పెన్షన్లకు అదనంగా నూతన పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అన్నారు .గీత కార్మికులు, చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని మంత్రి తెలిపారు. నూతన పెన్షన్లతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతున్నప్పటికీ ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.నూతన పెన్షన్లకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కొత్త పెన్షన్ల కోసం అనేక మంది ప్రజలు తమకు విజ్ఞప్తులు చేశారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు**

తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య**

రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్కు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులు**

గురుకులాలకు సంబంధించి పెండింగ్లో ఉన్న సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని మంత్రి తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**సాగునీటికి కొరత లేకుండా చర్యలు...**

సాగునీటి అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్రంలో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో వెలుమ కార్పొరేషన్ చైర్పర్సన్ జువ్వాడ నరసింహారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్,డి సి సి జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్, డి ఆర్ డి ఓ రఘువరన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకెప్పుడిస్తారు..?

- **నిరుపేదల ఇళ్ళతో చెలగాటమా...?**
- **హుజురాబాద్ లో ఆరేళ్లుగా నిరుపయోగంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు...**



**హుజురాబాద్, ఆగస్టు 13 (మనం న్యూస్):** ఒకటి కాదు రెండు కాదు.. ఆరేళ్లు గడిచాయి... అయినా హుజురాబాద్ లో నిరుపేదలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మాత్రం మోక్షం కలగడం లేదు. నిర్మాణాలు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్న... ఇంకా అధికారులకు ప్రభుత్వానికి నిరుపేదలపై సానుభూతి కలగడం లేదు. నిరుపేదలు వేలాది రూపాయలు పెట్టి పిల్లలతో వృద్ధులతో కూలీ పని చేస్తూ కిరాయి ఇళ్లల్లో నివసిస్తూ కిరాయి ఇళ్లలోనే ప్రాణాలు పోతున్నా... స్మశాన వాటికలోనే.. రోడ్డుపైనే టెంట్ వేసుకుని అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నా.. కనికరం కలగడం లేదు. రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు.. తమ రాజకీయ ప్రయోజనాలు చూస్తున్నారు.. తప్ప.. ఒక నిర్ణయాన్ని తీసుకోలేకపోవడం దురదృష్టకరం. అనారోగ్యంతో ఉన్న వృద్ధులు ఉంటే.. ఎక్కడ ప్రాణాలు పోతాయో అని ఇళ్ల యజమానులు వారిని ఖాళీ చేస్తున్నారు. గృహాలను నిర్మించి.. ఎవరికి ఉపయోగపడకుండా.. ఎవరికి ఇవ్వకుండా.. కాలయాపన చేస్తుండడంతో.. అవి కూడా శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయ్యే పరిస్థితి ఏర్పడింది.

**మొత్తం 500 గృహాలు...**

హుజురాబాద్ పట్టణంలో సిరిసపల్లి రోడ్డు లో ఉన్న గణేష్ నగర్ లో నిరుపేదల కోసం 2017 లో గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించింది. ఆయా వార్డుల్లో అర్హులైన వారు పేద ప్రజలు కండ్లల్లో వత్తులు వేసుకుని ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. నాడు వార్డుకు 20 చొప్పున 20 వార్డులకు కలిపి మొత్తం 500 పైగానే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మాణం చేశారు.

**అడుగడుగునా అడ్డంకులే...**

2018 లో నిరుపేదలకు పంపిణీ చేయాలని నాటి పాలకులు, అధికారులు ప్రయత్నించగా.. అసెంబ్లీ ఎన్నికలకి నోటిఫికేషన్ రావడంతో అడ్డంకి ఏర్పడింది. తదనంతర కాలంలో నాటి మంత్రి ఈటల రాజేందర్ బీ ఆర్ ఎస్ కు రాజీనామా చేయడంతో మరోసారి డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి బ్రేక్ పడింది. 2021 నుండి 2023 వరకూ ఈటల బిజెపి ఎమ్మెల్యే ఉండగా, ప్రభుత్వ విఫ్ గా కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఆ పరిస్థితుల్లో కూడా ఇళ్ల పంపిణీ సాధ్యం కాలేదు.

# జగిత్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



**జగిత్యాల ఆగస్టు 13(మనం న్యూస్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక టౌన్ హాల్ నుండి తహసీల్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు తో కలిసి బీజేపీ జగిత్యాల నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతబూని నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. భారతమాతకు జై, వందేమాతరం నినాదాలతో జగిత్యాల పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత మరియు దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లంచం తిసుకుంటూ ఏసీబీకి చిక్కిన బీర్పూర్ ఆర్ఐ



**జగిత్యాల / బీర్పూర్, ఆగష్టు 13 ( మనం ప్రతినిధి ):** జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండల ఆర్ఐ రాహుల్ రూ. 30 వేల లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ డిఎస్పి మహేందర్ రేడ్డీ ఆధ్వర్యంలో వ్యూహాత్మకంగా దాడి చేసి రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే బిర్పూర్ పరిధిలోని 12 గుంటల భూమిని సదా భయానా ద్వారా కొనుగోలు చేసిన దానిని భూ భారతి లో పట్టకొరకు దరఖాస్తు చేసుకోగ మండల ఎమ్ ఆర్ ఓ అట్టి భూమిని ఆర్ ఐ ని పరిశీలించి నివేదికను ఇవ్వమని కోరినారు. అట్టి విషయం లో భూమి పరిశీలించి నివేదికను పెండ్డింగు లో పెట్టి గా భాధితులు ఆర్ ఐ ని సంప్రదించగా 30 వేల రూపాయలు డిమాండ్ చెయ్యగా భాధితులు ఏ సి బి అధికారులు ఆశ్రహించగా ఏసిబి డిఎస్పి ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వాహించి రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నాం అని డిఎస్పి తెలిపారు.ఆర్ఐని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినాము అని తెలిపారు.అనంతరం బిర్పూర్ మండల రెవెన్యూ ఆఫీసులో ఏ సి పి అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్బంగా ఏసిబి డి ఎస్ పి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అధికారులు పనుల నిమిత్తం లంచాలు అడిగితే ఏ సి పి ఆశ్రహించాలి అని కోరారు.



# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- **ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమారు**

**జగిత్యాల, ఆగష్టు 13 ( మనం ప్రతినిధి ):** జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్, పార్కింగ్, భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ ,డి ఆర్ డి ఓ మరియు మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తును, ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు.ఆహ్వానితులకు, విద్యార్థులకు మరియు ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు, వైద్య సిబ్బంది, శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.

విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలని అన్నారు.

జిల్లా ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవ దినోత్సవాన్ని గౌరవంగా, దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని ఆహ్వానించారు.

ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, డిఆర్డిఏ రఘువరన్, డి ఎస్ పి పురుషోత్తం రెడ్డి, డిపి ఆర్ వో శ్రీధర్, సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.వో కిషన్, ఎమ్మార్వో రామ్మోహన్, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, డిఆర్డిఏ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపైనే ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

- **ట్రాఫిక్ నిబంధనలను గాలికి వదిలేసిన సంబంధిత అధికారులు**
- **రహదారిపై వాహనాలను నిలుపుతుండడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
- **మైనర్లు, ర్యాష్ గా వాహనాలను నడుపుతున్నవారిని పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు**



**జమ్మికుంట, ఆగస్టు 13 (మనం న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని ప్రధాన రహదారుల పైన ఎక్కడ చూసినా వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో తోటి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్తంగా తయారైన పార్కింగ్ వ్యవస్థను క్రమ పద్ధతిలో ఉంచేందుకు దృష్టి సారించాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. జమ్మికుంట పట్టణానికి నిత్యం సుమారు వందలాది గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో జమ్మికుంట పట్టణంలో ఎక్కడ చూసిన వాహనాల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంటుంది. గాంధీ చౌక్ నుంచి మోత్కులగూడెం చౌరస్తా వరకు, గాంధీ చౌక్ నుంచి డిగ్రీ కళాశాల వరకు, గాంధీ చౌక్ నుంచి పాత కూరగాయల మార్కెట్ వరకు వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉండడంతో పలు అనసరాల నిమిత్తం జమ్మికుంటకు వస్తున్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆయా దుకాణాలలో వారికి అవసరం ఉన్న వస్తువులను కొనుగోలు చేసే సమయంలో వాహనాలను రోడ్డుపైనే ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో తోటి ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జమ్మికుంట బస్టాండ్ నుంచి శ్రీరామ అనుపత్రి వరకు వాహనాల రద్దీ మరి ఎక్కువగా ఉంటుంది. ఆర్‌ఓబి వంతెన కింద వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ సదరు కాలి ప్రదేశాలలో చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాహనదారులు రహదారిపై తమ తమ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ రహదారుల గుండా ప్రయాణం సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణ పై అంటి ముట్టనట్లు వ్యవహరించడంతో పాటు పోలీస్ అధికారులు సైతం ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేయడంతో వాహనదారులు ఇష్టానుసారం వాహనాలను నడిరోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నారని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం జమ్మికుంటలో వారసంత నిర్వహిస్తుండడంతో ఆరోజు శివాలయం సమీపంలోని రహదారి వాహనాలతో పూర్తిగా నిండిపోయి తోటి ప్రయాణికుల అవస్థలు వర్ణాతీతంగా ఉంటాయి. మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశం ఉంటుందనే అభిప్రాయం పట్టణ ప్రజలతోపాటు పలువురు వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు.

**మైనర్లు, ర్యాష్ గా వాహనాలను నడుపుతున్నవారిని పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు**

జమ్మికుంట పట్టణంలో పలువురు మైనర్ బాలురు పాఠశాలలకు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలను నడుపుకుంటూ వెళ్తున్న తీరు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఒకపక్క పోలీస్ యంత్రాంగం మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమాని పై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నప్పటికీ మైనర్ల తల్లిదండ్రులలో మార్పు రావడం లేదు. అంతేకాదు కొంతమంది అల్లరి మూకలు తమ తమ వాహనాలను ర్యాష్ గా నడుపుతూ పట్టణ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనాలు నడుపుతున్న మైనర్లను, ర్యాష్ గా వాహనాలను నడుపుతున్న అల్లరి మూకలను గుర్తించి వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తే కొంతలో కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రోడ్లపై వెళ్తున్న వాహనాలను ఫోటోలు తీసి జరిమానా (చాలన్) వేయడమే కాకుండా మైనర్లు, అల్లరి మూకలు ర్యాష్ గా వాహనాలను నడపకుండా దృష్టి సారించాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ పకడ్బందీగా చేయాలి

- **ఈ నెల 31 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం**




**రాజన్న సిరిసిల్ల, ఆగష్టు -13 (మనం ప్రతినిధి ):** చేయూత పింఛన్ల కోసం జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చేయూత పెన్షన్ల కోసం వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు(తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు మొత్తం ఏడు రకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడు రకాల పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో మొదలుపెట్టామని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో సంబంధిత అధికారులు సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. ప్రతి దరఖాస్తుతో పాటుగా ఆధార్ కార్డ్, వయసు ధ్రువీకరణ (ఓటర్ కార్డు/జనన ధ్రువీకరణ పత్రము/విద్యాభ్యాసం ధ్రువీకరణ పత్రం) రేషన్ కార్డ్, తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ దృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ జత చేయాలని సూచించారు. వితంతు మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు గ్రామాల్లో 30 ఏండ్ల వయసు, పట్టణాల్లో 35 ఏండ్ల వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారులు ధృవీకరణ చేయాలని, గీత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, ఎక్సైజ్ శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో పాటు, గీత కార్మికుల సొసైటీలో సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు. నేత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ శాఖ వారి గుర్తింపు పత్రం ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డయాలసిస్ బాధితులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా మంజూరు అయిన 40 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం, చెవిటి వారికి 51 శాతం వైకల్య ధ్రువీకరణ యూ డీ ఐ డీ పత్రం ఉండాలని సూచించారు. తల సేమియా, సికిల్ సెల్, హిమోఫోలియా బాధితులు కూడా యూడీఐడీ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు జాగ్రత్తగా నింపాలని, కావాల్సిన పత్రాలను జత చేసి ఆన్లైన్ కూడా పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్ కు కావలసిన అన్ని పత్రాలను కచ్చితంగా జత చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

**ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహించాలి...**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫోలియా కోసం ప్రత్యేక సదరం వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ మేరకు బాధితులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు జారీ వేగంగా చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# బంజారాల ఆచార, సాంప్రదాయాలను కాపాడుకోవాలి



● మంత్రి సీతక్క

**ములుగు, ఆగస్టు 13,మనం ప్రతినిధి:** ములుగు జిల్లా: ములుగు మండలం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సారంగపల్లిలో బంజారా సమాజం నిర్వహించిన సంప్రదాయ పండుగ తీజ్ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మతానికి, ప్రతి కులానికి, ప్రతి సామాజిక వర్గానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు ఉంటాయని అన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదే సమయంలో ఇతర మతాలు, కులాలు, సామాజిక వర్గాల ఆచార సంప్రదాయాలను కూడా గౌరవిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. బంజారా సంస్కృతిలో తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, మహిళలు, యువతులు సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగను ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు, యువతులతో కలిసి మంత్రి సీతక్క సాంప్రదాయ నృత్యంలో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, స్థానిక సర్పంచ్ అర్రెం వెంకన్న, బంజారా సమాజ నాయకులు, మహిళలు, యువతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘర్ ఘర్ తిరంగ్ జెండాను ఎగరవేయాలి



● కప్పర ప్రసాద్ రావు

**గజ్వేల్, ఆగస్టు 13 మనం న్యూస్:** స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఫిరంగి ర్యాలీని నిర్వహించడం జరిగిందని బిజెపి రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాద్ రావు తెలిపారు. గురువారం నాడు గజ్వేల్ పట్టణంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 76వ సంవత్సరం నుండి 80 సంవత్సరం వరకు అంటే ఐదు సంవత్సరాలుగా ప్రతి ఆగస్టు నెల 15 తేదీకి ముందు ఈ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం నాడు నిర్వహించిన ఈ ర్యాలీలో గజ్వేల్ పట్టణంలోని బిజెపి నాయకులు కార్యకర్తలే కాకుండా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో హర్షనీయమని ఆనందాన్ని వెలిబుచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశానుసారం ఈ వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవలే వీటిపై కూడా భారత పార్లమెంటులో చర్చించిన అనంతరం దీనికి వ్యతిరేకంగా ఎవరైనా పాల్పడితే వారికి శిక్షలు తప్పవని తీర్మానం చేసినట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, బండారు మహేష్ మనోహర్ యాదవ్, నరసింహ, వెంకట్ రెడ్డి, తో పాటు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఇందిరాపార్క చివరి స్థానం నుండి ప్రారంభించిన ఈ ర్యాలీ తెలంగాణ తల్లి విగ్రహం, అంబేద్కర్, వివేకానంద, మీదుగా బసవేశ్వర విగ్రహం నుండి తిరిగి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సీతక్క



**ములుగు, ఆగస్టు 13,మనం ప్రతినిధి:** అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క గురువారం పరామర్శించి ఓదార్చారు. ములుగు మండలం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పులిగిండం గ్రామానికి చెందిన పులసం వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క గురువారం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్, గ్రామ సర్పంచ్ అర్రెం వెంకన్న, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి



● కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, ఆగస్టు 13 మనంప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఎస్డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఈ నెల 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నందున, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, విద్యుత్, రాకపోకల మార్గాలు తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా అప్పగించిన విధులు, బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్తో పాటు సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్డబ్ల్యూ ఎస్పీ, డీఎస్పీ హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదిక, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్, రాకపోకల మార్గాలు, సభా ప్రాంగణం తదితర అంశాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

**ఆగస్టు 17న భూమిపూజ..ఎకరా స్థలంలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన**

**పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందించడమే లక్ష్యం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**రామచంద్రాపురం, ఆగస్టు 13 (మనం న్యూస్):** పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెల్లాపూర్లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ (ఙ్ఖఊ) పరిధిలోని తెల్లాపూర్లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాల నిర్మించనున్న తెల్లాపూర్లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకే ప్రాంగణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం ద్వారా విద్యార్థులకు నిరంతర విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్రూమ్లు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్లు, కంప్యూటర్ ల్యాబ్లు, సమృద్ధిగా పుస్తకాలతో లైబ్రరీలు, ఇతర ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ ప్రాంతంలో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 17న నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. తెల్లాపూర్లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు, ప్రభుత్వ విద్యా రంగంలో నూతన ప్రమాణాలకు నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుట్టల గంగారంలో యువకుడు ఆత్మహత్య



**కన్నాయిగూడెం, ఆగస్టు 13, మనం ప్రతినిధి:** మండలంలోని గుట్టల గంగారం గ్రామానికి చెందిన కోడె రాహుల్ కుమార్ (22) తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది.ఎస్సై ఇనిగాల వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుట్టల గంగారానికి చెందిన కోడె రాహుల్ కుమార్, తండ్రి ఆదినారాయణ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యం సేవిస్తున్న రాహుల్ను మద్యం సేవించవద్దని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రాహుల్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు.రాహుల్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి, అమ్మమ్మ అతడి కోసం వెతుకుతూ పొలం వద్దకు వెళ్లగా చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.మృతుడు కోడె రాహుల్ కుమార్ వయసు 22 సంవత్సరాలు కాగా, ఎస్టీ కోయ సామాజిక వర్గానికి చెందినవారు. వ్యవసాయం వృత్తిగా చేసుకుంటూ గుట్టల గంగారం గ్రామంలో నివాసం ఉంటున్నాడు.

# గజ్వేల్‌లో 200 పడకలతో సమగ్ర ద్వితీయ స్థాయి వైద్య సేవలు

- అన్ని విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు
- ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు
- డయాలసిస్, పాలియేటివ్ కేర్ సేవలు

**గజ్వేల్ ఆగస్టు 13 మనం న్యూస్:** గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా-శిశు ఆసుపత్రుల ద్వారా మొత్తం 200 పడకల సామర్థ్యంతో సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్, పరిసర ప్రాంతాల ప్రజలకు సమగ్ర ద్వితీయ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, మౌలిక వసతుల వివరాలను వెల్లడించారు. వివిధ విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు... 100 పడకల జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి, స్త్రీ వైద్య శాస్త్రం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఈ ఎన్ టి , నేత్ర వైద్యం, అనస్థీషియా, రేడియాలజీ, డెంటల్, పాథాలజీ తదితర విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. అత్యవసర వైద్య సేవలతో పాటు రక్త నిల్వ కేంద్రం, డయాలసిస్, పాలియేటివ్ కేర్, ఆరోగ్యశ్రీ తదితర సేవలు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. మాతా-శిశు ఆసుపత్రిలో ప్రత్యేక సేవలు జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా పనిచేస్తున్న 100 పడకల మాతా-శిశు ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు నవజాత శిశు సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు ఆసుపత్రుల్లో స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ , డెడికేటెడ్ పీడియాట్రిక్ కేర్ యూనిట్ , ప్రయోగశాల పరీక్షలు, అల్ట్రాసౌండ్, ఎక్స్రే, ఈసీజీ , రక్త నిల్వ కేంద్రం వంటి కీలక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రయోగశాలలో సుమారు 50 రకాల పరీక్షలు, టీ హబ్ పరిధిలో సుమారు 50-55 రకాల పరీక్షలు నిర్వహించే సదుపాయం ఉందన్నారు. అదనంగా ఫార్మసీ, ఇమ్యునైజేషన్ క్లినిక్లు, పాలియేటివ్ కేర్, డయాలసిస్ సేవలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అవసరమైన వైద్య సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గజ్వేల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది కృషి చేస్తున్నారని డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. మన జిల్లా ఆసుపత్రి లో ఐసీయూ విభాగం లేనందుకు సీరియస్ గా ఉన్న కేసులను మాత్రమే మెరుగైన వైద్యం కొరకు ఉన్నత ఆసుపత్రి రెఫర్ చేస్తామని తెలిపారు. ఇటీవల సాధారణ బదిలీలలో నర్సింగ్ విభాగం నుండి 13 మంది ఒకేసారి బదిలీ కావడం 2 మాత్రమే రావడం జరగటంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఏర్పడింది ఇట్టి విషయం ఉన్నత



అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవ చేయడం కొరకు మా వంతు మేము కృషి చేస్తున్నామని అన్నారు. ఆసుపత్రిలో ఇటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావచ్చని సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ సూచించారు.

# ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

**జగిత్యాల ఆగస్టు 13(మనం న్యూస్):** వాల్మీకి ఆవాసం సేవా భారతి జగిత్యాల ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటుచేసిన పోలీసు శిక్షణ శిబిరాన్ని వినియోగించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ అన్నారు. గురువారం వాల్మీకి ఆవాసంలో ఏర్పాటుచేసిన సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులను టౌన్ సిఐ కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి అనేది సమాజంలో ఒక బాధ్యత గల ఉద్యోగం అని దీన్ని సాధించడానికి శారీరక శ్రమతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ కఠోర పరిశ్రమ కూడా ఉండాలన్నారు. ఎంతోమంది గ్రామీణ యువకులకు పోలీస్ మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా భారతి వాల్మీకి ఆవాసం ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి తమను





భాగస్వాములను చేయడం అభినందనీయం అన్నారు. ప్రధాన వక్త ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవ ప్రముఖ ఆకు రాజేందర్ మాట్లాడుతూ దేశ సేవ, సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ పొందడానికి వచ్చిన యువకులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఎస్పి సుబ్రహ్మణ్యం, వాల్మీకి ఆవాస కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, చిత్తారి మధుకర్, అశోక్ రావు, చంద్రశేఖర్, సత్యం , సురేష్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# 24న ఆదివాసీ హక్కుల కోసం శాంతియుత ర్యాలీ



**కన్నాయిగూడెం, ఆగస్టు 13, మనం ప్రతినిధి:** ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఈ నెల 24న నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షుడు పోడెం బాబు, ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గావిడి నాగబాబు, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు పిలుపునిచ్చారు.తుడుందెబ్బ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పోడు భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణ నోటిఫికేషన్ల కారణంగా స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. 1/70 చట్టం గిరిజనేతరులకు అన్యాయం చేయడానికి ఉద్దేశించినది కాదని, ఆదివాసీల భూములు, హక్కులను పరిరక్షించేందుకు రూపొందించబడిన చట్టమని నాయకులు పేర్కొన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు సంబంధించిన హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు కావడం లేదని, దీంతో గిరిజన యువతకు ఉపాధి, విద్యా అవకాశాల్లో నష్టం జరుగుతోందని వారు అన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 24న ఎక్కల బ్రిడ్జి నుంచి ఐటీడీఏ ఏటూరునాగారం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గ్రామాల ప్రజలు, నిరుద్యోగ యువత, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా నాయకులు పోశెట్టి శ్రీనివాస్, కన్నాయిగూడెం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొరగట్ల నాగేష్, మేకల మహేష్, దబ్బాగట్ల సురేష్తో పాటు ఆదివాసీ పెద్దలు ఆలం బిక్షపతి, మల్లెల లక్ష్మయ్య, మల్లెల బాలయ్య, యాళం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



**కాటారం, ఆగస్టు 13( మనం న్యూస్):** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాటారం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. గురువారం పీహెచ్సీ పరిధిలోని దేవరాంపల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటిని కాచి లేదా శుద్ధి చేసి తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. దామరకుంట గ్రామంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్తో పాటు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్పీవీ టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ సుమన్, డాక్టర్ వందన, సర్పంచ్ పాగే ఆమనీ సురేష్, ఏఎన్ఎంలు సరోజన, రజిత, ఎంఎల్హెచ్పీ మహిళా హెల్త్ సూపర్వైజర్ సరళ, మహిళా హెల్త్ అసిస్టెంట్లు విజయలక్ష్మి, రజిని, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు సరిత, లక్ష్మి, జ్యోతి, సంధ్య,, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి ములుగు పర్యటనను విజయవంతం చేయాలి

**మంగపేట, ఆగస్టు 13, మనం ప్రతినిధి:** ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ములుగు జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య పిలుపునిచ్చారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు మంగపేట మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన ములుగు జిల్లా అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. యువత, మహిళలు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం పర్యటనతో ములుగు అభివృద్ధి పథంలో మరో ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ సమావేశంలో ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ జగన్మోహన్రెడ్డి, జిల్లా ఆత్మ కమిటీ సభ్యుడు గాదె శ్రావణ్కుమార్, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, తుడి భగవాన్రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నరసింహారావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎంపెల్లి వీరస్వామి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మైప లాలయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదయతుల్లా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బసారీకారి హరికృష్ణతో పాటు యువజన, మహిళా, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ పనులను
# వేగవంతం చేయాలి

నీటిపారుదల మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ..
సీతారామ ప్రాజెక్టు పనులపై సుదీర్ఘ చర్చ
మూడు నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో
532 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి
జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి



ఖమ్మం, ఆగస్ట్ 13(మనం న్యూస్): సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం భేటీ అయ్యారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు

**రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి...**

మూడో పంప్హౌస్ నుంచి నాలుగో పంప్హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ.45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

**పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్ని సస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్హౌస్ నుంచి దమ్మపేట మండలం లోని నాలుగో పంప్హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్లైన్ ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

**జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి...**

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి, రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

# మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

- రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జండా ఆవిష్కరణ



ఖమ్మం, ఆగస్టు 13(మనం బ్యూరో): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు.

ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

**నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు**

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా...**

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది. వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

## సేవా కార్యక్రమాల్లో యువతకు ఆదర్శంగా వేల్పుల కిరణ్



వైరా ఆగస్టు 13(మనం న్యూస్): ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, వృద్ధులకు చేయూతనివ్వడం వంటి సేవా కార్యక్రమాలను తన బాధ్యతగా భావిస్తూ సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు.యువ సమాజ సేవకుడు వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన వేల్పుల కిరణ్. గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి అండగా నిలుస్తున్నారు. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సమాజ సేవకుడు వేల్పుల కిరణ్సమాజంలో ఆర్థిక అసమానతలను చూసి చలించిన వేల్పుల కిరణ్ తనకు చేతనైన స్థాయిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పేదలు, విద్యార్థులు, వృద్ధులకు అండగా నిలుస్తూ తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు.

వైరాలోని బాల వెలుగు స్కూల్ విద్యార్థులకు ఒక సంవత్సరం పాటు భోజన సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్థికంగా అండగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థుల చదువుకు ఇబ్బందులు ఎదురుకాకుండా తన వంతు సహాయం అందిస్తూ పలువురికి చేయూతనిచ్చారు. అదేవిధంగా గొల్లపూడిలోని ఓల్ ఏజ్ హోమ్ లో ప్రతి సంవత్సరం సంక్రాంతి, దసరా పండుగల సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేస్తూ వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్నారు. పేదరికంలో ఉన్న అనేక మందికి కూడా తనకు సాధ్యమైన మేరకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. సమాజంలో సేవా భావంతో ముందుకు వచ్చే యువత మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, వృద్ధులకు చేయూతనివ్వడం, పేదలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను యువత చేపట్టాలని ఆయన కోరారు. సమాజ సేవ చేస్తున్న యువకులను ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు గుర్తించి ప్రోత్సహించి వారికి అండగా నిలవాలని కోరారు . ఎలాంటి ప్రచారం ఆశించకుండా తనకు చేతనైన సహాయాన్ని అందిస్తూ నిత్యం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న వేల్పుల కిరణ్ను పలువురు అభినందిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ఇంకెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని పలువురు ఆశిస్తున్నారు.

## పాఠశాల అంగన్వాడీ, ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే జారే



దమ్మపేట ఆగష్టు 13(మనం న్యూస్): దమ్మపేట మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో నేను సైతం చేయూత కార్యక్రమంలో భాగంగా విద్యా యాత్ర మన ఎమ్మెల్యే మన బడి అనే నూతన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా ఎంపీపీఎస్ కొమ్ముగూడెం పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు,తరగతి గదుల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం, వంటశాల నిర్వహణ పరిసరాల పరిశుభ్రతను నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక పాలన గ్రామాభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వానికి ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో నాణ్యమైన సేవలు అందించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు,పాల్గొన్నారు.

## విద్యార్థులు సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి




ఖమ్మం, ఆగస్ట్ 13(మనం న్యూస్): ప్రస్తుత సాంకేతిక యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం నగర సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.రవికుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారంనాడు ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో , వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన సురక్షాతిరంగా-ఫ్రాడ్ కాపుల్ స్టాప్₹ కార్యక్రమంలో భాగంగా 'స్టూడెంట్ ప్రోగ్రాం ఫర్ అవేర్నెస్ రెస్పాన్సిబుల్ సైబర్ స్పేస్ (స్పార్క్) క్లబ్ -ఎన్.ఎస్.ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సైబర్ నేర రహిత తెలంగాణ కోసం యువత కీలక భాగస్వాములుగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎస్.ఐ.ఎం.విజయకుమార్ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండాలని తెలిపారు.అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్ శ్రీనివాస్, ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.ఎం.పిచ్చయ్య, డా.ధర్మయ్య, డా.ఎం.వి.రమణ, డా.వేణుమా, దవ్ వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు క్రైం విభాగ సిబ్బంది ప్రసాద్, నాగేశ్వరరావు, విజయ , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి సెంట్రల్ వర్క్ షాప్ కీలకం
### సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు



కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 13(మనం న్యూస్): సింగరేణికి సెంట్రల్ వర్క్ షాప్ విభాగం ఎంతో కీలకమైందని సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు అన్నారు. సింగరేణి కార్పొరేట్ పరిధిలో గల సెంట్రల్ వర్క్ షాప్ ను గురువారం ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా సెంట్రల్ వర్క్ షాప్ లోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతి ఉత్పత్తి సామర్థ్యం నాణ్యత ప్రమాణాలు నిర్వాహణ కార్యకలాపాలను ముఖ్యంగా ఫౌండ్రీ సెక్షన్ ఫేబ్రికేషన్ మెషిన్ షాప్ క్వాలిటీ విభాగాలను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ సెంట్రల్ వర్క్ షాప్ సంస్థకు ఎంతో కీలకమైన విభాగమని సెంట్రల్ వర్క్ షాప్ ని మరింత అభివృద్ధి చేసి ఉపరితల గనులు భూగర్భ గనులు సిహెచ్పిలకు అవసరమైన పరికరములు తయారు చేసి అధిక లాభాల్లోకి తీసుకురావడానికి అధికారులు సూపర్వైజర్లు కార్మికులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. రక్షణ నాణ్యతలో రాజీ పడకుండా ఉత్పాదకతను పెంచుతూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధి లాభదాయకత కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తిరుమలరావుతో పాటు జిఎం( ఈ అండ్ ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ్ మోహన్, డిజిఎం(ఈ అండ్ ఎం)లు దర్భ శ్రీనివాస్, కే.వేలాద్రి, ఎస్ఈ (ఈ అండ్ఎం) ఆర్.కేశవ రావు, డివైఎస్ఈ(ఈఅండ్ఎం)లు పి.నాగేశ్వర రావు, వెంకట రాజు, జేఈ(ఈ అండ్ఎం) డి.నారాయణరావు, కే.నాగమోహన్, డి.యాదగిరి, జేటిఓ సిహెచ్.శ్రీధర్, జేఎస్ఓ జి.శ్రీనివాస్, సెంట్రల్ వర్క్ షాప్ ఏఐటియూసి ప్రతినిధులు నరేశ్, ఐఎన్టియూసి ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్లు పాల్గొని డైరెక్టర్ కి ఆయా విభాగాల పనితీరును వివరించారు.

# మోడికి ట్రంప్ ఫోబియా

కమ్యూనిస్టులతో మార్పు తథ్యం
ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు
తప్పు చేయకపోతే జంకు ఎందుకు?
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




ఖమ్మం, ఆగస్ట్ 13(మనం బ్యూరో): సువిశాల భారతదేశానికి ప్రధాని అయిన నరేంద్రమోడి పిరికివాడిగా మారిపోయాడని, ఆయనకు ట్రంప్ ఫోబియా పట్టుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. 145 కోట్ల జనాభా గలిగిన దేశానికి ప్రధానిగా ఉన్న అల్పసంఖ్యాకులైన సంపన్నులు కార్పోరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. సిపిఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రల అనంతరం ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది పార్టీ కార్యకర్తలు, కళాకారుల ప్రదర్శనతో వైరా రోడ్ అరుణావర్ణం పులుముకుంది. భక్తరామదాసు కళాక్షేత్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాట ఫలితంగా వచ్చాయని, ఇప్పుడు దేశంలో మార్పు సైతం, కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని ఇది తథ్యమని అన్నారు. ఎన్నికలు ఆర్థిక వ్యవహారంతో ముడిపడి కోట్లు ఖర్చు చేస్తున్నవారు మాత్రమే విజయం సాధిస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టులు సీట్లు గెలవలేకపోవచ్చు కాని, గెలుపు ఓటములను, శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని సాంబశివరావు తెలిపారు. మోడి, అమిత్ షాలు తప్పు చేశామన్న భావనతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ వచ్చేందుకు జంకుతున్నారన్నారు. మోడికి తిరోగమనం ప్రారంభమైందని, సబ్బండ వర్గాలు మోడి పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ధర్మేంద్రప్రధానే రాజీనామాతో మోడి అహంకారం దిగిపోయిందని, యువత ముఖ్యంగా జెనీ ఉద్యమం దేశవ్యాపితమైందని, బిజెపి అధికారం కోల్పోటమే ఇక మిగిలిందని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రపంచ వ్యాపితంగా పురోగమిస్తున్నారని, అందుకే అక్కడ ట్రంప్, ఇక్కడ మోడి బయటపడుతున్నారన్నారు. దేశాన్ని దోచుకుంటూ సంపదను, కార్పోరేట్లకు కట్టబెడుతున్న బిజెపి సర్కార్, ఇప్పుడు అయోధ్య రాముని సొమ్ముకు ఎసరు పెట్టిందని, బిజెపి దాని అనుబంధ సంస్థలు, దొంగల దండుల దేశంపై పడ్డారని, చీమల దండులా కదిలి దొంగల దండును తరిమి వేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలు బాధపడుతున్నారని, అయినా ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తూనే ఉంటామని కూనంనేని తెలిపారు. గెలుపు ఓటములు ఎన్నికల వరకే పరిమితమని, ఒకటి రెండు సీట్ల కోసం ప్రజా సమస్యల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఈ సారి పోటీ తథ్యమన్నారు.

**హామీల అమలుకు పోరాటం**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, అమలు చేయడంలో తాత్సారం ప్రదర్శిస్తుందని, హామీలను విస్మరిస్తే ఆందోళన తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సన్నబియ్యం, ఉచిత బస్సు మినహా మిగిలిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సిపిఐ ప్రజాచైతన్య యాత్రతో హేమంతరావు మాట్లాడుతూ అప్పుల పేరుతో హామీలను అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. బిఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇండ్ల మాదిరే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తుందని, జెండా కప్పుకుంటునే ఇండ్లు కేటాయిస్తామనటం సరికాదు. సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియచేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాల పైనా, రాష్ట్రంలో హామీల అమలు కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సభలో సిపిఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, అజ్మీరా రామమూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, కళాకారులు సతీష్ బృందం అలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

## మారు పేర్ల సమస్యను
# పరిష్కరించండి
### ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 13(మనం న్యూస్): సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణి కార్మికుల(అలియాస్ )పేర్ల మార్పు ప్రక్రియను ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న తమ తండ్రుల ఉద్యోగంలో పేర్ల మార్పు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుటుంబాలు గురువారం చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో వెళ్లి సందర్శించి దీక్షలు చేస్తున్న సోదరులకు పూలమాలలు వేసి తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి మూలధనాన్ని అందించే సింగరేణి సంస్థలో తమ చెమట రక్తాన్ని ధారాబోసి ఉత్పత్తిని పెంచి ఎన్నో లాభాలను అందిస్తున్న సింగరేణి కార్మికుల కుటుంబాలు సంక్షేమంతో సంతోషంగా ఉంటేనే సింగరేణి సంస్థ యొక్క పరువు ప్రతిష్టలు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యాజమాన్యంతో చర్చలు జరిపి ఈ పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగించాలని లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేసి భావ సార్వ్యపృత కలిగిన అన్ని సంఘాలను కలుపుకొని వారికి సంఘీభావంగా సమస్య పరిష్కరించేంతవరకు కూడా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ నాయకులు టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సురేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మచ్చా పృథ్వీరాజ్, జిల్లా కార్యదర్శి ఎనిగంట శ్రీనివాస్, బెస్ట్ సోషల్ ఆర్గనైజర్ అన్వర్ భాయ్ , సాయికుమార్, దీక్ష చేస్తున్న ఉద్యమ నాయకులు అధ్యక్షులు శ్రావణ్ గౌడ్, దన్నడ్ రాజు, హరీష్, రాజేష్, అన్వేష్, అద్దంకి రంజిత్ పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం



- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 13 (మనం బ్యూరో): విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేసేందుకు క్రీడలను పోలీస్ అధికారులు బిజీగా ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్ కేశవ్ పాటీల్ గురువారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్నెస్తో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు సుమారు రూ.8 లక్షల నిధులతో ఈ ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటారని ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఉద్యోగికీ క్రీడలు అవసరమే అయినప్పటికీ పోలీసు సిబ్బందికి వాటి అవసరం మరింత ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, ఏకాగ్రత, చురుకుదనం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని,పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటే విధి నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరన్నారు. పోలీసు సిబ్బందికి మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు రూ.8 లక్షల నిధులతో ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ ప్రత్యేక కృషితో ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ సదుపాయాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు ఫిట్నెస్ తో ఉంటేనే ఉద్యోగ నిర్వహణ శారీరక మానసిక ఆనందం కలుగుతుందని ప్రతి ఒక్కరు విధిగా శారీరక మానసిక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ......, పోలీసు ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్నెస్ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, రెవెన్యూ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో ఉంటారని, అనేక సందర్భాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుందని ఎస్పీ తెలిపారు. ఇటువంటి పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల ద్వారా శారీరక ఫిట్నెస్ను పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్నెస్పై ప్రత్యేక దృష్టి సారిస్తూ శాఖాపరంగా అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు ఉన్నప్పుడే విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలమన్నారు. కలెక్టర్, ఎస్పీ, అధికారులు స్వయంగా షటిల్ ఆడి ఉత్సాహంగా పాల్గొన్నారు.కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ తదితర అధికారులు నూతన ఇండోర్ షటిల్ కోర్టులో స్వయంగా బ్యాడ్మింటన్ ఆడారు. కొద్దిసేపు అధికారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడంతో పోలీసు సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నెల కోల్పారు. అధికారులు స్వయంగా క్రీడా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పోలీసు సిబ్బందికి ఆరోగ్యం, ఫిట్నెస్పై మరింత అవగాహన కల్పించారు. అంతకుముందు పోలీస్ క్రీడా మైదానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్కు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించి ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం కలెక్టర్, ఎస్పీ కలిసి నూతన ఇండోర్ షటిల్ కోర్టును పరిశీలించి, ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ , సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్



ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 13 (మనం బ్యూరో): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గద్వాల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు సూచనలను ఇచ్చారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్య అతిథిలు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ కు ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. ఆగస్టు 15న. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. జిలాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్ ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డీవో శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏ.ఓ మంజుల, గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు

- స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలి...
- ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగాఎలాంటి లోటుపాట్లకు తావివ్వొద్దు
- అధికారులకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆదేశం



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 13 (మనం బ్యూరో): దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ హేమం త్ కేశవ్ పాటీల్ అన్నారు. ఆగస్టు 15న. నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్తో కలిసి జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పెరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక నిర్మాణం, ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ చేసే ప్రాంతం, పోలీస్ పరేడ్ నిర్వహణ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రదర్శన కోసం ఏర్పాటు చేయనున్న స్టాళ్లు తదితర అంశాల ఏర్పాటు పై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశ ప్రజలందరికీ అత్యంత ప్రాముఖ్యత కలిగిన జాతీయ పండుగ అన్నారు. ఈ పండుగను జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పెరేడ్ మైదానంలో ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ చేసే ప్రదేశాన్ని ప్రత్యేకంగా పరిశీలించిన, కార్యక్రమం సజావుగా సాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికపై ప్రముఖులు, అధికారులు కూర్చునే విధానం, ఆహ్వానితులకు సీటింగ్ ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ పాఠశాలలు, విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి అవసరమైన రిహార్సల్స్, వేదిక ఏర్పాట్లు, విద్యార్థుల కూర్చునే ప్రదేశాలు తదితర అంశాలను సమన్వయంతో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించే విధంగా శాఖల వారీగా ఏర్పాటు చేయనున్న స్టాళ్లపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఆయా శాఖలు తమ పథకాలు, కార్యక్రమాల వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను స్టాళ్లలో ఆకర్షణీయంగా ప్రదర్శించాలన్నారు. స్టాళ్ల ఏర్పాటులో సమన్వయం పాటిస్తూ మైదానంలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. మైదాన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, కార్యక్రమానికి ముందు అన్ని ఏర్పాట్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళిక చేసుకుని అమలు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ పెరేడ్ మైదానంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీస్ పరేడ్ నిర్వహణ, పోలీసు సిబ్బంది విధులు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రజల కదలికలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంట అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చన,సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాదుల పట్ల సింహస్వప్నం కామ్రేడ్ కాస్ట్రో

- అమెరికాకు వెన్నులో వణుకు పుట్టించిన కాస్ట్రో
- కాస్ట్రో స్ఫూర్తితోనే కరోనా సమయంలో క్యూబా వైద్యులు ప్రపంచానికి సేవలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



కొత్తగూడెం టౌన్, ఆగస్టు 13 (మనం న్యూస్): అమెరికన్ సామ్రాజ్యవాదుల పట్ల క్యూబా మాజీ అధ్యక్షుడు క్యూబా విప్లవ రథసారథి ఫైడల్ క్యాస్ట్రో సింహ స్వప్నమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మంచి కంటి భవన్లో ఫైడల్ క్యాస్ట్రో శత జయంతి కార్యక్రమం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా క్యాస్ట్రో చిత్రపటానికి మచ్చ వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా తుమ్మితే ప్రపంచానికి జలుబు చేస్తుందన్న నానుడిని వమ్ము చేస్తూ.... అగ్రరాజ్యానికి కంటిమీద కునుకు లేకుండా చేసిన, ధీశాలి, సోషలిస్టు యోధుడనీ కొనియాడారు. అమెరికా తన సామ్రాజ్యవాద చర్యలతో క్యూబాను ఆర్థికంగా చాలా ఇబ్బందులు పెట్టినప్పటికీ ఆర్థిక దిగ్బంధనం చేసినప్పటికీ చిన్న దేశమైన క్యూబా అమెరికాకు సవాలు విసిరే స్థాయికి ఆ దేశాన్ని అభివృద్ధి చేశాడని తెలిపారు. అమెరికా నుండి క్యూబాకు ఎంత దూరమో క్యూబా నుండి అమెరికాకు అంతే దూరం ఉందని అమెరికా అధ్యక్షుని ఎదిరించిన ధైర్యశాలి క్యాస్ట్రో అని కొనియాడారు. తాను బ్రతికున్నంత వరకు అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విరామం లేకుండా పోరాటం చేశాడని ఆ పోరాట క్రమంలోనే అగ్రరాజ్యం అమెరికాకు ప్రపంచ దేశాలు గడగడలాడుతున్న సందర్భంలో అమెరికాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన దమ్మున్న నాయకుడు క్యాస్ట్రో అని తెలిపారు. అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ ఆయన మీద 634 సార్లు హత్యా ప్రయత్నం చేసింది . అయినా ఆయన అమెరికాకు లొంగలేదు. ''మా దేశం ఇతర దేశాల మీద బాంబులు వేయదు. మా దగ్గర న్యూక్లియర్ బాంబులు గానీ, జీవాయుధాలు గానీ లేవు. మానవాళికి సేవ చేయడానికి ఎప్పుడూ మా వైద్యుల్ని మాత్రం సంసిద్ధుల్ని చేస్తుంటాం''. సోషలిస్టు వ్యవస్థలోనే శాశ్వత శాంతి ఉంటుందని నమ్మి క్యూబాలో సోషలిస్టు వ్యవస్థను నిర్మించాడని తెలిపారు. ప్రపంచమంతా కరోనా మహమ్మారితో వైద్య సేవలు అందక అతని కోతలం అవుతున్న సందర్భంలో 150 దేశాలకు చిన్న దేశమైన క్యూబా తమ డాక్టర్ను పంపించి వైద్య సేవలు అందించిందని ఇది మాకు మాజీ అధ్యక్షుడు కాస్త అందించిన స్ఫూర్తి అని ఆ డాక్టర్లు ప్రకటించడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యానారాయణ కే బ్రహ్మచారి రేపాకుల శ్రీనివాస్ నాయకులు జి రాజారావు ఎం శ్రీను సతీష్ సలీం విజయ్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకే లేఅవుట్లు చేపట్టాలి

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవ్

## లేఅవుట్లలో రోడ్ల విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

## మున్సిపల్ కమిషనర్కు జిల్లా కలెక్టర్ ఆదేశాలు



ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 13 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్లాట్ల లేఅవుట్లపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సందర్శించారు. పట్టణ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు లేఅవుట్లు, పట్టణాభివృద్ధి క్రమబద్ధంగా సాగేందుకు, ప్రజలకు భవిష్యత్తులో రహదారులు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా, జిల్లా ఎస్పీ ఎదురుగా, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు లేఅవుట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ లేఅవుట్ల ఏర్పాటు ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో ప్లాట్ల విభజన, రహదారుల ఏర్పాటు, రోడ్లకు కేటాయించిన స్థలం, లేఅవుట్ హద్దులు, ఇతర మౌలిక సదుపాయాలకు కేటాయించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. లేఅవుట్ అభివృద్ధి సమయంలో నిబంధనలకు అనుగుణంగా స్థలాలను కేటాయించారా, రహదారుల విస్తీర్ణం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉందా, లేఅవుట్ హద్దులు సక్రమంగా నిర్ధారించారా అనే విషయాలపై లేఅవుట్ ల పరిశీలించి అధికారులతో సుదీర్ఘంగా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లేఅవుట్లలో రహదారులు, ప్రజా అవసరాలకు కేటాయించే స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిర్దేశించిన ప్రదేశాలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత నిర్వాహకులపై ఉందన్నారు. ప్రైవేటు లేఅవుట్ల విషయంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేయకుండా ముందస్తు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన లేఅవుట్లను కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. లేఅవుట్లలో రహదారుల విస్తీర్ణం అత్యంత కీలకమైన అంశమన్నారు. భవిష్యత్తులో జనాభా పెరుగుదల, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారుల వెడల్పు, హద్దులు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని కలెక్టర్ సృష్టా వ్యక్తం చేశారు. రహదారులకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా లేఅవుట్ల హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, రహదారులు లేదా ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లేఅవుట్లను అనుమతించే సమయంలోనే అన్ని నిబంధనలను కచ్చితంగా పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, లేఅవుట్లకు సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలుపై అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేటు లేఅవుట్లను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్లకు సంబంధించిన రికార్డులు, అను మతులు, స్థల వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్నాయో లేదో నిర్ధారించ ుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు లేఅవుట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




పెనుకొండ ఆగష్టు 13 మనం న్యూస్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు గురువారం పెనుకొండ పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ ర్యాలీని జాతీయ జెండాను ఊపి ప్రారంభించారు.విద్యార్థినీ విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకొని, దేశభక్తి నినాదాలు చేస్తూ పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీగా సాగారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి జాతీయ భావాలను పెంపొందించుకోవాలని, దేశ నాయకులను స్మరించుకుంటూ దేశభక్తి స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద లేదా కార్యాలయం వద్ద ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కె. సుదర్శన్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. విద్యార్థులు ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే విద్యార్థినీ విద్యార్థులు 'విజన్ 2047' లక్ష్యాన్ని ఎంచుకొని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి దేశాల సరసన నిలిచేలా తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎస్.ఎన్. మూర్తి, ఉమా శంకర్, సీనియర్ అసిస్టెంట్ అల్లా బకాష్, ఎన్ఎస్ఎస్ పీఓలు డి. శివన్న, ఎస్. హఫీజ్, కె. రవికుమార్, ఆర్ఆర్సీ విజయ ప్రకాష్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కూటమి నాయకులు, సచివాలయాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు ముగ్గురి ఎంపిక



ధర్మవరం ఆగస్టు 13 మనం న్యూస్: కాలేజ్ గ్రౌండ్లో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో జీ.వీ. జెడ్పీజీహెచ్ఎస్ విద్యార్థిని బి. ప్రణీత రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వై. సుమన, పీడీ స్వరూప, పీటీ సరళ, ఉపాధ్యాయులు ప్రణీతను అభినందించారు.ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ-కోచింగ్ సెంటర్ క్రీడాకారులు ఏ. ఉదయ్ (-68 కిలోలు), కొండ అర్చన (-52 కిలోలు) కూడా ఎంపికైనట్లు కోచ్ ఇనాయత్ భాషా తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కార్చిచ్చుకు కారణమైన హెలికాప్టర్ ప్రమాదం..!



**టెక్సాస్, ఆగష్టు 13:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో సైనిక హెలికాప్టర్ కూలిపోవడంతో కార్చిచ్చు చెలరేగింది. మంటలు వేగంగా వ్యాపించి క్షణాల్లో వందల ఎకరాల మేర గడ్డి దగ్ధమైంది. దీంతో సమీప ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సైనికులు మృతిచెందారు. సాలడో పట్టణం సమీపంలోని పొలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇది అత్యంత తీవ్రమైన ఘటన అని బెల్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ప్రమాదానికి గురైంది ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలికాప్టర్ అని ఫోర్ట్ హుడ్ సైనిక స్థావరం వెల్లడించింది. హెలికాప్టర్ కూలిన వెంటనే మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. బుధవారం సాయంత్రానికి కార్చిచ్చును 50 శాతం అదుపులోకి తెచ్చినట్లు టెక్సాస్ అగ్నిమాపకశాఖ తెలిపింది. హెలికాప్టర్ కూలిపోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు యూఎస్ మిలిటరీ అధికారులు తెలిపారు.

# టీకాలతో ట్రంప్ ఆటలు!

### పిల్లల వ్యాక్సిన్ సిఫార్సులు, షెడ్యూళ్లలో మార్పులతో గందరగోళం



**వాషింగ్టన్, ఆగష్టు 13:** భారీగా సుంకాల వడ్డింపు, ఇరాన్‌తో యుద్ధం వంటి చర్యలతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను ఇబ్బందుల్లోకి నెట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా ఓ వివాదాస్పద నిర్ణయంతో స్వదేశంలోనూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. అమెరికాలో పిల్లల టీకాల సిఫార్సులు, షెడ్యూళ్లలో మార్పులు చేస్తూ ఆయన కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఈ మార్పులు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత విధానం ప్రకారం- పిల్లలకు వేర్వేరు టీకాలను ఒకేసారి కలిపి ఇచ్చేవారు. దానివల్ల పదేపదే ఆసుపత్రులకు వెళ్లాల్సిన ఇబ్బంది ఉండేది కాదు. అందుకు భిన్నంగా ట్రంప్ నూతన విధానాన్ని ప్రతిపాదించారు.

ఇది వేర్వేరు టీకాలను వేర్వేరు విభాగాలుగా విభజించింది. అవన్నీ వేయించుకోవాలంటే పిల్లలను చాలాసార్లు ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అందరు పిల్లలకూ అన్ని వ్యాక్సిన్లు వేయాల్సిన అవసరం లేదనీ కొత్త విధానం స్పష్టం చేసింది. దీని ప్రకారం- తట్టు, గవద బిళ్లలు, రుబెల్లా, డిఫ్తీరియా, టెటానస్, పెర్టుసిస్, పోలియో, హిబ్, న్యూమోకోకల్ వ్యాధి, హెచ్‌పీవీ, ఆటలమ్మ వ్యాక్సిన్లను అందరికీ ఇస్తారు. హెపటైటిస్ ఎ, హెపటైటిస్ బి, ఆర్ఎస్వీ, మెనింజోకోకల్ వ్యాధి టీకాలను మాత్రం ముప్పు ఎక్కువగా ఉన్నవారికే అందిస్తారు.

**ఎంఎంఆర్ వేర్వేరుగా..**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు తట్టు, గవద బిళ్లలు, రుబెల్లా (ఎంఎంఆర్) వ్యాక్సిన్‌ను కలిపే ఇస్తున్నారు. దాన్ని మూడు వేర్వేరు టీకాలుగా ఇవ్వాలని ట్రంప్ తాజాగా ఆదేశించారు. ఎంఎంఆర్ వేర్వేరు వ్యాక్సిన్లుగా అమెరికా మార్కెట్లో లేనే లేదు. వాటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 90 రోజుల గడువు ఇస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

**విమర్శల వెల్లువ**

ఎంఎంఆర్ వ్యాక్సిన్ గురించి ట్రంప్ ఇంతకుముందు మాట్లాడుతూ.. మూడు వ్యాధులకు కలిపి ఒకేసారి టీకా వేయడం ప్రాణాంతకమన్నారు. ఆయన వ్యాఖ్య అశాస్త్రీయమంటూ వైద్యులు ఖండించారు. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకపోవడంతో విమర్శలు వెలువడుతున్నాయి. అమెరికాలో టీకా రేట్లు పడిపోతూ తట్టు విజృంభిస్తున్న సమయంలో ట్రంప్ తాజా ఉత్తర్వులు తల్లిదండ్రుల్లో భయాందోళనలను, గందరగోళాన్ని సృష్టించొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొవిడ్ సమయం నుంచి టీకాల వ్యతిరేక ఉద్యమాన్ని నడుపుతున్న అమెరికా ప్రస్తుత ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెనడీ జూనియర్ అభీష్టం మేరకే టీకాలపై ట్రంప్ ప్రస్తుత ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

### అమెరికాకు వచ్చిన 600 మంది

# గర్భిణుల వీసాలు రద్దు



**వాషింగ్టన్, ఆగష్టు 13:** బర్త్ టూరిజంపై అమెరికా ఉక్కుపాదం మోపుతోంది. పిల్లలను కనడానికే అమెరికాకు వచ్చే వారిని నియంత్రిస్తోంది. ఒక్క జులై నెలలోనే 9వ నెల గర్భంతో ఉండి అమెరికాకు వచ్చిన 600 మంది వీసాలను రద్దు చేసింది. బర్త్ టూరిజం నిరోధక టాస్కఫోర్స్ ఆధ్వర్యంలో వీసాలను పరిశీలించి రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. మరోవైపు కఠిన వీసా నిబంధనల కారణంగా అమెరికాకు ఈ ఏడాది వచ్చిన విద్యార్థుల సంఖ్య తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫాల్ సీజన్‌లో 1.12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు.

# సుఖ్ బీర్ సింగ్ బాదల్‌పై దాడి

### ఆయన ఆరోగ్యంపై ప్రధాని ఆందోళన



**నాందేడ్, ఆగష్టు 13 :** శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్ బీర్ సింగ్ బాదల్ పై దాడి జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న గురుద్వారా సమీపంలో ఓ వ్యక్తి ఆయనపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో బాదల్ కుడి చేతికి గాయమైంది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడి జరిగిన సమయంలో బాదల్ సతీమణి, అకాలీదళ్ ఎంపీ హర్ సిమ్రత్ కౌర్ బాదల్ సైతం ఆయన వెంటే ఉన్నారు. ఈ ఘటనలో బాదల్ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. 2024 డిసెంబర్ లోనూ బాదల్‌పై ఓసారి హత్యాయత్నం జరిగింది. అమృత్ సర్‌లోని స్వర్ణ దేవాలయం వెలుపల ఓ వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపారు. అయితే, బుల్లెట్ గురితప్పడంతో ఈ ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. దుండగుడిని పోలీసులు అక్కడికక్కడే అరెస్టు చేశారు.మాజీ సీఎం ప్రకాశ్ సింగ్ బాదల్ తనయుడే సుఖ్ బీర్ సింగ్ బాదల్. 2009 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు పంజాబ్ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. సుఖ్ బీర్ దాడి విషయం తెలుసుకున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్.. నాందేడ్ ఎస్పీతో మాట్లాడారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశించారు.

**మోడీ ఆరా...**

ఈ దాడి నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీశారు. బాదల్ సతీమణి, ఎంపీ హర్ సిమ్రత్ కౌర్ తో ఫోన్లో మాట్లాడారు. మరోవైపు.. బాదల్ క్షేమంగా ఉన్నారని అకాలీదళ్ తెలిపింది. ఇటీవలే బాదల్ ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ, అకాలీదళ్ మళ్లీ చేతులు కలుపుతాయన్న ఊహాగానాలకు ఈ సమావేశం ఊతం ఇస్తోంది.

### ఎర్రకోట బాంబు పేలుడు

# అల్-ఖైదా పనే

### ధృవీకరించిన ఐరాస భద్రతా మండలి



**న్యూయార్క్, ఆగష్టు 13 :** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబరులో జరిగిన పేలుడుకు అల్-ఖైదా అనుబంధ సంస్థ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ధ్రువీకరించింది. ఈ దాడితో 'అల్-ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్కాంటినెంట్ 'కు సంబంధం ఉందని పేర్కొంది. ఈ మేరకు దీనిపై నివేదిక విడుదల చేసింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఏక్యూఐఎస్ గతంలో చిన్న బృందంగా ఉండేదని.. ప్రస్తుతం ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా రూపాంతరం చెందుతోందని ఐరాస భద్రతా మండలి తన నివేదికలో తెలిపింది. అల్-ఖైదా, ఐసిస్ సంస్థలు రసాయన, జీవ ఆయుధాల తయారీపై చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంది. భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్ను స్థావరం చేసుకొని, అక్కడ తమ ముఠాలను బలోపేతం చేయడానికి అడి తీవ్రంగా ప్రయత్నిస్తోందని ప్రకటించారు.

### హైవే అంబులెన్సులు 10 నిమిషాల్లో

# చేరుకోకుంటే రూ.10వేల ఫైన్




**ఢిల్లీ, ఆగష్టు 13 :** జాతీయ రహదారులపై ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు అత్యవసరంగా స్పందించడంలో జాప్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ .. సంబంధిత నిబంధనలను మరింత కఠినతరం చేసింది. నేషనల్ హైవేలపై మోహరించే అంబులెన్సులు పది కిలో మీటర్ల పరిధిలోని ఏ ప్రమాద స్థలానికైనా పది నిమిషాల్లో చేరుకోవాలని నిర్దేశించింది. లేదంటే ఒక్కో ప్రమాదానికి రూ.10వేల జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంబులెన్సులు టికెట్ స్వీకరించిన తర్వాత గంటలోపే ప్రమాద బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలని పేర్కొంది. నిర్దేశించిన గడువులోగా చేర్చకున్నా రూ.10 వేల పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.ప్రమాద సంఘటనల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్హెచ్ఏఐ కేర్ సిస్టమ్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అంబులెన్సులు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాలు సహా ఆన్-రోడ్ యూనిట్ల నిర్వహణకు కొత్త నిబంధనలు రూపొందించింది.

నూతన మార్గదర్శకాల ప్రకారం.. సంఘటన జరిగిన ప్రదేశాన్ని బట్టి పది కి.మీ పరిధిలోని ప్రమాద స్థలికి చేరుకునేందుకు 10నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదు. అంతకన్నా ఎక్కువ దూరం ఉంటే అందుకు అనుగుణంగా కొంత ఎక్కువ సమయం తీసుకోవచ్చు. వాహనానికి ఉండే జీపీఎస్ ద్వారా అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు. ఏదైనా అత్యవసర టికెట్ను అంబులెన్సు తిరస్కరించినా రూ.10 వేల జరిమానా పడుతుంది. కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం అన్ని పరికరాలు, ఔషధాలు, సిబ్బంది ఉండాలి. లేదంటే జరిమానా తప్పదు. ఎన్హెచ్ఏఐ పరిధిలో ప్రస్తుతం 50వేల కి.మీ మేర జాతీయ రహదారులున్నాయి. వీటిపై 3000 అంబులెన్సులు, 1000 పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఏఐఎస్-400 కంప్లెంట్ జీపీఎస్ పరికరాలు ఉండడంతోపాటు ఒక్కో వాహనంలో ఐఓటీ సిమ్తో కూడిన ఆండ్రాయిడ్ మొబైల్ కూడా ఉంటుంది.

జాతీయ రహదారుల్లో హెల్ప్ లైన్ కోసం 1033 నెంబర్ ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రమాదాల వేళ అత్యవసర స్పందనలో జాప్యాన్ని తగ్గించాలని రోడ్డు భద్రతపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీతోపాటు కాగ్ ఆడిట్ నివేదికలు సూచించిన విషయాన్ని ఎన్హెచ్ఏఐ గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈ నూతన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని అందరు ప్రాజెక్టు డైరెక్టర్లు, రీజినల్ ఆఫీసర్లకు ఎన్హెచ్ఏఐ స్పష్టం చేసింది. అలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

# అందుకే.. పార్టీ మారిన

### తాను ఆప్ ను వీడి బీజేపీలో చేరడంపై క్రికెటర్ హర్భజన్ సింగ్




**ఢిల్లీ, ఆగష్టు 13 :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో తన మాటకు విలువ లేకపోవడంతోనే బీజేపీలో చేరినట్లు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆప్ లో చేరానని.. తన సూచనలు పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్ కాస్ట్ లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్లో హర్భజన్ తో పాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

'రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశా. పంజాబ్ లోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్ లో చేరా. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడేవాడిని కాదు' అని హర్భజన్ చెప్పారు. పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. 'నేను ఎవరిని మోసం చేశాను? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను' అని అన్నారు.

పంజాబ్ లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పంజాబ్లోని ఓ చిన్న గ్రామం నుంచి ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

## వివాదాన్ని ఇక ముగించండిమాల్యా, ఎస్బీఐకి బాంబే హైకోర్టు సూచన



**ముంబై, ఆగష్టు 13 :** పరారీలో ఉన్న పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేండ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు.

కింగ్ ఫిషర్ ఎయిర్లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను 'పరారైన ఆర్థిక నేరస్థుడి'గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే.. మాల్యా తొలుత భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే, బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్ కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు, మాల్యాను భారత్కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

### భారతీయ శాస్త్రవేత్తకు

# డిరాక్ అవార్డు




**లండన్, ఆగష్టు 13:** గణాంక యాంత్రిక శాస్త్రం (స్టాటిస్టికల్ మెకానిక్స్)లో అపూర్వ ఆవిష్కరణలు చేసినందుకు భారతీయ భౌతిక శాస్త్రవేత్త దీపక్ ధర్ ప్రతిష్టాత్మక డిరాక్ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సంవత్సరం ఈ పతకాన్ని అందుకుంటున్న నలుగురు శాస్త్రవేత్తలలో ధర్ ఒకరని ఈ అవార్డును ప్రదానం చేసే ఇటలీకి చెందిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ సంస్థ గత శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ధర్ బెంగళూరులోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌కు చెందిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్. 2026 పతకాన్ని ఆయన ఫ్రాన్స్‌కు చెందిన బెర్నార్డ్ డెరిడా, ఇటలీకి చెందిన మార్క్ మెజార్డ్, ఇజ్రాయెల్, అమెరికాలకు చెందిన హైమ్ సోంపొలిన్స్కీలతో ఈ అవార్డును పంచుకున్నారు.

## అప్పుడు కోర్టుకెళ్లిండ్రు? ఇప్పుడు అవే భూములకు వేలం వేస్తుండ్రు?

### రాయదుర్గం భూముల వేలం తక్షణమే ఆపాలి..సీఎంకు లేఖ

### సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు ప్రశ్నల వర్షం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వం 'వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్ మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్‌బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు, థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది' అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు. అయితే, గతంలో ఇదే భూముల పరిరక్షణ కోసం 2020లో రేవంత్ రెడ్డి కోర్టులను ఆశ్రయించారని చెప్పారు.

# ఉచితాలపై రాష్ట్రం అగమాగం



- **ప్రభుత్వ హామీలు, ఫ్రీ స్కీమ్స్ పథకాలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**
- **ఉచిత పథకాలతో దివాళ దిశగా ప్రభుత్వం.. ప్రమాదంలో పడనున్న రాష్ట్రం**
- **రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్న హైకోర్టు**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఫ్రీ ఫ్రీ ఫ్రీ.. ఇప్పుడు, ఈ ఫ్రీ ఫ్రీ భారీ పాపులర్ పదం కూడా.. అవును మీరు విన్నది, వింటున్నది నిజమే. గత కొంత కాలంగా రాష్ట్రంలో ఉచిత పథకాల అమలు, వాటి ఆర్థిక భారంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం... చట్టబద్ధమైన ప్రక్రియ, అసెంబ్లీ తీర్మానం లేకుండా కేవలం జీవోల ఆధారంగానే ప్రజాధనాన్ని వెచ్చించే పథకాలను ఎలా కొనసాగిస్తారని పాలక ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే, ఇటీవల సర్కార్ తీరును నిలదీస్తూ మొట్టికాయలు వేస్తూ, అత్యున్నత ధర్మాసనం గట్టిగా మందలించిన విషయం తెలిసిందే.. అది మర్చిపోకముందే.. తాజాగా గురువారంనాడు విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. నాలుగు వారాలు గడిచినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ పథకాల అమలుపై తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు మధ్యంతర 'స్టే' విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ, ప్రధానంగా భారీ ఖర్చులు, ప్రస్తుత పరిస్థితులు, రాష్ట్ర బడ్జెట్ అంచనాలు, రాబడిని విశ్లేషిస్తూ ఆదాయంలో మెజారిటీ భాగం జీతాలు, అప్పులు, సంక్షేమ పథకాలకే సరిపోతే అభివృద్ధికి కేవలం కొన్ని వేల కోట్లు మాత్రమే మిగులుతున్నాయని న్యాయస్థానం గుర్తుచేసింది. అర్హులైన పేదలకు సహాయం చేయడం సమంజసమే అయినా, శ్రీమంతులకు కూడా ఉచితాలు అందజేస్తుండటం ఆర్థిక వ్యవస్థను డేంజర్ జోన్‌లోకి నెడుతోందని తీవ్రంగా వ్యాఖ్యానించింది.

ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత, బడా బాబులేందరో పల్సర్ బైక్, ఐ ఫోన్ పట్టుకుని ఉచిత బియ్యం తీసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని.. ఫలితంగా ఇక్కడి ప్రజలు పని కల్చర్‌ను అసలే (మొత్తం) మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకోవాల్సి వస్తోందని తీవ్రంగా దుయ్యబట్టింది. పరిస్థితులు ఇలాగే ఉంటే భవిష్యత్తులో 'ఒకప్పుడు మనుషులు పని చేసేవారట' అని మ్యూజియంలో ప్రదర్శనగా పెట్టాల్సి వస్తుందని పాలక ప్రభుత్వాల తీరును ఎండగడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

రాజకీయాల కోసం ఒక్క తెల్ల రేషన్ కార్డును కూడా తొలగించే ధైర్యం చేయడం లేదని, ఐ ఫోన్లు, ఐ ప్యాడ్లు పట్టుకున్న వారూ ఉచితాల కోసం చూస్తున్నారని తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే? ఎంతటి కుబేరుడైనా సరే?, డబ్బులన్నీ అయిపోయి భవిష్యత్తులో చివరికి పనికి ఆహార పథకం కూలీగా మారక తప్పదని ఆందోళన వ్యక్తం చేసింది. ఫ్రీ.ఫ్రీ.ఫ్రీ అనే ఉచితాలు ఉన్నం(ఇచ్చిన)ంత కాలం ఎవరు పని చేయరు అని అభిప్రాయపడింది. ప్రభుత్వం వీలేనంత తొందరగా ఉచితాల తీసివేసి, చదువుకున్న వారికి ఉద్యోగాల కల్పన, పేద, మధ్యతరగతి వర్గాల వారికి సైతం ఉపాధి మార్గాలు, చూపకపోతే?..రేపటి తరం భవిష్యత్తు అత్యంత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ.. ప్రభుత్వాలు చే(సిన)స్తున్న ప్రకటనలు, ఇస్తున్న ఉచితాలు, పలు స్కీముల తీరును తప్పుబడుతూ తెలంగాణ హైకోర్టు చేసిన తీవ్రంగా మందలిస్తూ హెచ్చరికలు, సూచనలు జారీ చేసిన తీరుతోనైనా పాలక ప్రభుత్వాలకు కనువిప్పు కానుందా? లేదా? అన్నది రానున్న రోజుల్లో తె(లనుంది)లియనుంది.



- కుటుంబ సభ్యులపై కేసులు రాజకీయ కక్ష సాధింపే
- మహిళా సంఘాలకు నా మిల్లు అప్పగించేందుకు సిద్ధం
- సీఎంఆర్ విషయంలో మిల్లర్లను నేరస్తులుగా చేయడం సరికాదు
- రైస్ మిల్లర్ల గొంతుకై ప్రభుత్వంతో పోరాడుతా
- బియ్యం రికవరీపై సీఎం పౌరసరఫరాల శాఖ మంత్రి సమక్షంలోనైనా బహిరంగ చర్చకు సవాల్

# తప్పు చేస్తే...ఏ శిక్షకైనా సిద్ధం

సూర్యాపేట ఆగస్టు 13 ( మనం ప్రతినిధి) సిఎం ఆర్ వ్యవహారంలో తనను దోషులుగా చిత్రీకరిస్తున్న ప్రభుత్వ పెద్దలు సివిల్ సప్లై అధికారులు తప్పని తెలిస్తే ఏ శిక్ష కైనా సిద్ధమనీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రా రైస్ మిల్ నిర్వాహకులు వట్టె జానయ్య యాదవ్ సవాల్ విసిరారు. గురువారం సూర్యాపేట రూరల్ పరిధిలోని వజ్ర రైస్ మిల్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... మహిళా సంఘాలకు రైస్ మిల్లులను అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని, అవసరమైతే తన వజ్రా రైస్ మిల్లును కూడా మహిళా సంఘాలకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. వజ్రా రైస్ మిల్ ప్రారంభమైనప్పటి నుంచి సీఎంఆర్కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏనాడు ఒక చిన్న నోటీసు తీసుకునే పరిస్థితి రాకుండానే చెల్లింపులు పూర్తి చేస్తూ వచ్చామని జానయ్య గుర్తు చేశారు. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు లోనైన అధికారులు తన మిల్లును లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారని రైస్ మిల్లుల వ్యవహారంలో వర్తించాల్సిన చట్టపరమైన నిబంధనలకు భిన్నంగా కక్షపూరితంగా అనేక క్రిమినల్ కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో సీఎంఆర్కు సంబంధించి ఒప్పందం చేసుకున్న వ్యక్తులపైనే చట్టపరమైన బాధ్యత ఉంటుందని, ఏదైనా ఉల్లంఘన జరిగితే వారిపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కానీ అందుకు భిన్నంగా తన కుటుంబ సభ్యులను కూడా కేసు నమోదు చేయడం ఏంటి అని ప్రశ్నించారు. కర్ణాటకలో ఎంబీబీఎస్ చదువుతున్న తన చిన్న కుమారుడిని సైతం అరెస్టు చేయడం రాజకీయ కక్ష, కుట్రలో భాగమేనని జానయ్య తేల్చి చెప్పారు.రైస్ ఇండస్ట్రీని నేరస్తులుగా చూడొద్దు రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమను, మిల్లర్లను నేరస్తులుగా చిత్రీకరించే విధానం సరికాదని జానయ్య అన్నారు. ధాన్యం మిల్లింగ్లో వాస్తవంగా ఎంత బియ్యం వస్తుందన్న అంశాన్ని శాస్త్రీయంగా, సాంకేతికంగా అటు ప్రభుత్వ పెద్దలు ఇటు అధికారులు. పరిశీలించాలని సూచించారు. ఒక క్వింటా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే వాస్తవ పరిస్థితుల్లో వచ్చే బియ్యం, ప్రభుత్వం నిర్దేశిస్తున్న రికవరీ మధ్య వ్యత్యాసం ఉంటుందని ఆయన వాదించారు. ఒక క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం ప్రభుత్వానికి అందించే విషయంలో మిల్లర్లపై షార్ట్ఫాల్ భారం పడుతోందన్నారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం, మిల్లింగ్ పరిస్థితులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆ నష్టాన్ని మొత్తం డిఫాల్ట్ కింద చూపించి కేసు నమోదు చేయడం. మొత్తం బాధ్యతను మిల్లర్లపైనే మోపి అక్రమార్కులుగా చిత్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని దయబట్టారు. ఇలాంటి ఎన్నో అంశాలు మిల్లర్లు ఎదుర్కొంటున్నారని. సీఎంఆర్ వ్యవహారంలో తన వాదన తప్పని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలోనైనా, పౌరసరఫరాల శాఖ మంత్రి ఆధ్వర్యంలోనైనా, సంబంధిత ఉన్నతాధికారులు, నిపుణుల సమక్షంలోనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ధాన్యాన్ని ప్రత్యక్షంగా మిల్లింగ్ చేసి ఎంత బియ్యం వస్తుందో ప్రజల ముందే నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు.

**రాజ్యాంగ విరుద్ధంగా పోలీసులు తీరు**

వజ్ర మిల్లుపై జరిగిన దాడులు, తన కుటుంబ సభ్యులపై నమోదు చేసిన కేసులు రాజ్యాంగ చట్ట నిబంధనలకు విరుద్ధమని ఇలాంటి చర్యలకు పాల్పడ్డ పోలీసుల తీరు పై జానయ్య మండిపడ్డాడు. అధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వ్యవహరించారని విమర్శించారు. తనకు న్యాయ వ్యవస్థ పై విశ్వాసంతో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందానని తెలిపారు. మిల్లును తిరిగి నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని చట్టబద్ధ అనుమతులు పొందిన తర్వాతే సూర్యాపేటలో అడుగు పెట్టానని స్పష్ట చేశారు. తాను చట్టానికి లోబడి వ్యాపారం చేస్తానని, తనపై ఏవైనా ఆరోపణలు ఉంటే వాటిని చట్టబద్ధంగానే నిరూపించాలని అన్నారు. పోలీసులే చట్ట పరిధిని దాటి వ్యవహరించారని రాజకీయ కక్షలతో వ్యాపార సంస్థలు, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య సమాజానికి గొడ్డలి పెట్టని తెలిపారు. ఇటువంటి చర్యలను సభ్య సమాజం గమనించాలని, చట్టవిరుద్ధమైన పోలీసు పద్ధతులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. వజ్రా రైస్ మిల్లు నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, మోసాలు జరగలేదని తాను నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలతో రావాలని, తాను తన వద్ద ఉన్న రికార్డులు, లెక్కలతో వస్తానని చెప్పుకొచ్చారు. ఈ ఆరోపణలపై ఎక్కడైనా ఎవరి తోనైనా మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు నేను సిద్ధంగా ఉన్నానని ఈ ఆరోపళ్లపై అసలు వాస్తవాలు ప్రజల ముందు ఉంచుతానని జానయ్య సవాల్ చేశారు. ఈ సమావేశంలో జానయ్య సతీమణి వట్టె రేణుక పలువురు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల/ ధర్మపురి ఆగస్టు 13 ( మనం న్యూస్ ): వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ధర్మపురి లో మంత్రి క్యాంపు కా ర్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ముద్రించిన వృద్ధుల రక్షణ చట్టం పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా లో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రభుత్వ కమిటీ ప్రతినిధులు జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిరాధరణకు గురవుతున్న వృద్ధుల కేసుల పరిష్కారం లో చేస్తున్న కృషి ని అభినందించారు.అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రం విషయం లో ఆందోళన వద్దని,తగు చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ విధులకు వెంటనే తగు వసతి కల్పించాలని కలెక్టర్ కు సూచించామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు, సీనియర్ న్యాయ వాది హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం. డీ. యాకూబ్, ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్,జగిత్యాల డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జెల బుచ్చి రెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్, కార్యదర్శి సింగం గంగాదర్,జిల్లా, డివిజన్, మండలాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరి వేసుకోకండి.... నష్టపోకండి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ, ఆగస్టు 13( మనం ప్రతినిధి): ఈ ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. వ్యవసాయ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి రైతులు వరి వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. వరి పంట వేసేందుకు పెట్టే పెట్టుబడి, నీటి లభ్యత, వర్షాలు, భూగర్భ జలాలు, కూలీల పెట్టుబడి అన్నింటిని రైతులకు వివరించి చెప్పి వరి పంట జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్, పరశురాం, ఖాదర్ తదితరులతో మాట్లాడారు. వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని, అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు. ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా, ఆదాయం వస్తుందని తెలియజేస్తూ ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి పంట వేసుకోవద్దని, అనవసరంగా ఇబ్బందులు పడవద్దని అన్నారు.వరి పంట వేసుకున్నట్లయితే మధ్యలోనే పంట ఎండిపోతుందని, ఇదివరకే చాలా చోట్ల బోర్లలో తక్కువ నీరు వస్తున్నదని,వరి పైన పెట్టిన పెట్టుబడి కూడా రైతుకు గిట్టుబాటు కాదని ,వరి పంట స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, సెప్టెంబర్ చివరివరకే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.



తిప్పర్తి మండల కేంద్రం శివారులో చౌడు భూముల్లో రైతులు వరి పంటకు సిద్ధం చేయడాన్ని గమనించిన కలెక్టర్ చౌడు భూముల్లో మినుములు, పెసర వంటి పంటలు వేసుకోవాలని, మినుము, పెసర పంటలకు పెట్టుబడి తక్కువని, ఎకరాకు 8000 చొప్పున ఆదాయం వస్తుందని, అదే వరి పంటకు పెట్టుబడి ఎక్కువని, పొరపాటున నీళ్లు లేక, వర్షం రాక పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతు అప్పుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు. చవుడు భూములలో జిప్సం వేసుకున్నట్లయితే మినుము, పెసర పంటల లాంటివి సులభంగా తీసుకోవచ్చని, అంతేకాక చౌడు నెలల్లో రేగు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా రైతులు ఆలోచించి ఆరుతడి పంటలు ,ఉద్యాన పంటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు వారి పరిధిలోని ప్రతి రైతు ను ప్రత్యక్షంగా కలిసి పంట వివరాలను తెలుసుకొని వరి పంట సాగు చేయవద్దని, వరి పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలను లెక్కలతో సహా వివరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. రైతులు యూరియా గురించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ అన్ని షాపులలో యూరియా దొరికే విధంగా అవకాశం కల్పించాలని, యాప్ ద్వారా యూరియా బుక్ చేయడం వల్ల వెంటనే స్టాకు అయిపోతున్నదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా ఇండెంట్ పంపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ను ఆదేశించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు ,ఏవో శ్రీనివాస్, ఏ ఈ ఓ సంతోషి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో
# నిందితుడికి 25 ఏళ్ల శిక్ష

- రూ.7వేల జరిమానా.. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

నల్లగొండ, ఆగస్టు 13( మనం ప్రతినిధి ): మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి నల్గొండ ఫాస్ట్రాక్ కోర్టు 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7,000 జరిమానా విధించిందని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.2020 సంవత్సరంలో మిర్యాలగూడ ఐఐ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి క్రైమ్ నంబర్ 97/2020, ఎస్సీ నెంబర్.198/2020లో ఐపిసిసెక్షన్లు 448, 366, 376(2)(ఐ ), పోక్సో చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేశారు.ఈ కేసులో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన జాఫీర్ , వయస్సు 20 సంవత్సరాలు, నిందితుడిగా ఉన్నాడు.కేసును దర్యాప్తు చేసి నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితుడిపై న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేయగా అనంతరం కేసు విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని ఐపిసి సెక్షన్ 366 మరియు పోక్సో చట్టం సెక్షన్ 3 4 కింద దోషిగా నిర్ధారించింది.ఐపీసీసెక్షన్ 366 కింద నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.అదేవిధంగా పోక్సో చట్టం సెక్షన్ 3 4 కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.పోక్సో చట్టంలోని సెక్షన్ 42 ప్రకారం ఐపీసీ, పోక్సో చట్టాల కింద వర్తించే శిక్షల్లో అధికమైన శిక్షను అమలు చేయాల్సి ఉండటంతో, అత్యాచారం నేరానికి పోక్సో చట్టం కింద విధించిన శిక్షను అమలు చేయాలని కోర్టు నిర్ణయించింది. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నాయి. దీంతో ఐపీసీ సెక్షన్ 366 కింద 5 సంవత్సరాలు, పోక్సో చట్టం కింద 20 సంవత్సరాలు విధించబడినప్పటికీ, కోర్టు ఆదేశాల ప్రకారం శిక్షలు ఏకకాలంలో అమలు అవుతాయి. మొత్తం జరిమానా రూ.7,000 అదేవిధంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించిన అప్పటి మిర్యాలగూడ-ఐఐ(టి ) పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డి. శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,కేసును న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదించిన వేముల రంజిత్ కుమార్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జె. సోమ నర్సయ్య, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,కోర్టు డ్యూటీ విధుల్లో సమన్వయంతో పనిచేసిన డి.సి.ఆర్.బి సీఐ శ్రీనునాయక్, సిడిఓ బుర్రి అఖిల్,డి. రాగ్యా నాయక్, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వ్యక్తులపై నల్గొండ జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్ ప్రక్రియలను సమర్థవంతంగా కొనసాగిస్తామని తెలిపారు.



# భూపాలపల్లి జిల్లాలో ఘనంగా దివ్య–కళ్యాణ్ వివాహ మహోత్సవం



భూపాలపల్లి, ఆగస్టు 13 మనంన్యూస్: భూపాలపల్లి జిల్లా దీక్షకుంట గ్రామంలో అజ్మీర అరుణ-శ్రీను దంపతుల కుమార్తె దివ్య, లావుడియా వనిత-గోవర్ధన్ దంపతుల కుమారుడు కళ్యాణ్ వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్య నాయకులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వివాహ వేడుకలో లావుడియా తారాబాయి-నాను నాయక్, జ్యోతి-బాలు నాయక్, లావుడియా శారద-రాము నాయక్, చాంది దాసు నాయక్, సరోజన-లక్ష్మణ్ నాయక్, విజయ-రఘురాం, లలిత-కరణ్, అరుణ-రాజన్న, లలిత-మోహన్, పుల్ బంద్-సీతారాం, అజ్మీర ఆనంద-దేవి-రవి నాయక్, రజిత-రాజన్న, వసంత-చీమన్ నాయక్, మమత-గణపతి, అంజలి-రాము, మౌనిక-రాజన్న, చిట్టి రాజు నాయక్, మాలోత్ సునీత-హనుమంతు, వేణు, కిరణ్, లావుడియా వనిత-గోవర్ధన్ నాయక్, లావుడియా విజయ-హేమా నాయక్, శ్రీ విద్యా-సుధాకర్, సుందర్ నాయక్, శ్రీకాంత్, లావుడియా పల్లవి-రాజు నాయక్, జీవన శ్రీ, సెహ్వాగ్, మాజీ కార్పొరేటర్ అనుషా-రవి నాయక్, అరుణ-నగేష్, సరిత-గణపతి, నందిని-అరవింద్, పృథ్వి, సురేష్, సునీత-సునీల్, కల్పన-గోపాల్, కవిత-జైపాల్, కుమారి-రాజు నాయక్, సుజాత-ఉదయ్ సింగ్, సంధ్యా-సందీప్, మమత-సంతోష్, సరిత-జల్ సింగ్, విమల-జట్ మాల్, సుమ-ప్రసాద్, ప్రమోద్, నారాయణ సింగ్, భారతి-ధరమ్ సింగ్, లత-వెంకటేష్, రామకృష్ణ, సంజీవ్, పోరిక వనిత-రవి నాథ్, ధన్ రాజ్ నాథ్, మౌనిక-మురళి, విమల, రాధిక-బాలు, సునీత, స్వర్ణ-వినోద్, మనీ, రజిత-రవీందర్, సునీత-మోహన్, అరుణ, చుక్కిబాయి, కమల, బుజ్జి పఠాన్, పులి రాజు, బిక్షపతి, మంగ-భోజ నాయక్, ఆగి, సాల్కి, వాళ్లకి, లక్పతి, బాలాజీ, మాంగని శ్రీను, రజిత, వెంకన్న, జగన్, రాజమ్మ-వి.పి. సింగ్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతన వధూవరులు దివ్య-కళ్యాణ్ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ముఖ్య నాయకులు హృదయపూర్వకంగా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.

# అభివృద్ధి సంక్షేమం అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

**ప్రతి శాఖపై పట్టుతో జిల్లాను అభివృద్ధి చేస్తున్న కలెక్టర్**

**గతంతో పోలిస్తే లా అండ్ ఆర్డర్ కేసుల పురోగతి ఎస్పీపై ప్రశంసలు**

**విలేకరుల సమావేశంలో ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషనర్ బక్కి వెంకటయ్య**




సూర్యాపేట, ఆగస్టు 13 (మనం ప్రతినిధి): ప్రభుత్వం నిరుపేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమం అలాగే అభివృద్ధి అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ కే నరసింహ తో కలిసి జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై సమీక్ష చేశారు. ఎక్కడైనా సబ్ ప్లాన్ నిధులు మిగిలిపోతే తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రోడ్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా ఆర్ఓఆర్ అమలు చేయాలని, ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. ఎంపీ నిధులు నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ డి ఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల పై దాడులకు సంబంధించి కోర్టు కేసులు జాప్యం లేకుండా పరిష్కరించాలని , శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీలే పనిచేస్తున్నందున పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. నెలకు ఒకసారి సివిల్ రైట్స్ డే బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరిగా 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని ఎస్పీకి సూచించారు. ఈ సమావేశాలకు స్థానిక ఎస్సై, తహసీల్దార్లతో పాటు శాఖాపరమైన అధికారులు తప్పక హాజరుకావాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున3్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**₹బాధితులకు ఇళ్లు ఉపాధి అవకాశాలు₹**

ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదు నమోదైన కేసుల్లోని బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి అవకాశాలను వెంటనే కల్పించాలని అధికారులను కోరారు. 'భూభారతి' ద్వారా ఎస్సీ, ఎస్టీల భూసమస్యలు పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్, ఎస్పీల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. అదేవిధంగా కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ వినూత్నంగా ముందడుగు వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్స్ లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్ అదనప కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్ ఎస్సి డిడి లత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల ఎత్తిపోతలపై సీఎం కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 13, మనం న్యూస్ : గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగి ంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. కన్నాయిగూడెం మండలం లోని దేవాదుల ప్రాజెక్టు నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టి నీటిని వినియోగి ంచుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం బుధవారం నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యల ను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**9 పంపులతో ఎత్తిపోతలు**

దేవాదుల ప్రాజెక్టు నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం 9 పంపులతో ఎత్తిపోతలు చేపడుతున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి జలాలను సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. అదేవిధంగా ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముంపు గ్రామాల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ నివేదికలు రూపొందించాలని నీటిపారుదల, రెవెన్యూ అధికారులకు సూచించారు. దేవాదుల ఎత్తిపోతల్లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరిస్తే మరింత నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.




# మంగపేటకు ఎస్సీ సెల్‌లో ఐదు కీలక పదవులు

మంగపేట, ఆగస్టు 13, మనం ప్రతినిధిః కాంగ్రెస్ పార్టీలో మంగపేట మండలానికి ఎస్సీ సెల్ విభాగంలో ఐదు కీలక పదవులు దక్కడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల ఎస్సీ సెల్లో నూతనంగా నియమితులైన నాయకులను పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించి అభినందించారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఏంపెల్లి వీరస్వామి, ఉపాధ్యక్షులుగా పల్లికొండ యాదగిరి, మైప లాలయ్య, కార్యదర్శిగా మూగల చంటి, మంగపేట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బసారికారి హరికృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగపేట మండలానికి ఎస్సీ సెల్లో ఐదు కీలక పదవులు కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్కు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ జగన్మోహన్రెడ్డి, ఆత్మ కమిటీ సభ్యుడు గాదె శ్రావణ్కుమార్, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, తుడి భగవాన్రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నరసింహారావు, ఎస్సీ సెల్ నాయకులు మైప లాలయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదయతుల్లా, బసారికారి హరికృష్ణతో పాటు యువజన, మహిళా, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు



ములుగు, ఆగస్టు 13,మనం ప్రతినిధి: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మేడారం ప్రాంతాన్ని ముస్తాబు చేయాలని, ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సమ్మక్క-సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణానికి వచ్చి శ్రీ సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి, ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు. ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మేడారానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరుపేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం శ్రీ సమ్మక్క-సారలమ్మ సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో సంతృప్తి స్థాయిలో పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. సమ్మక్క-సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్లలో ఘనంగా తిరంగా ర్యాలీ



- **విద్యార్థుల్లో వెల్లివిరిసిన దేశభక్తి**

**టేకుమట్ల ఆగస్టు 13 (మనం న్యూస్):** నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు టేకుమట్ల మండల కేంద్రంలో తిరంగా ర్యాలీ టేకుమట్ల మండల అధ్యక్షులు గుర్రపు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టేకుమట్ల హై స్కూల్ స్కూల్ నుండి టేకుమట్ల బస్టాండ్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు వందేమాతరం ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు. వివిధ దేశభక్తి, జాతీయతను ప్రతిబింబించే వేషధారణల్లో విద్యార్థులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు త్రివర్ణ పతాకాన్ని చేతబూని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, ఉత్సాహం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతదేశం పట్ల తమకున్న గౌరవాన్ని, జాతీయ పతాకంపై ఉన్న అభిమానాన్ని విద్యార్థులు ఘనంగా చాటుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తు. విద్యార్థుల శక్తి, ప్రతిభ, క్రమశిక్షణ, దేశభక్తితోనే భారతదేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది అని అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు నిర్వహించిన తిరంగా ర్యాలీ టేకుమట్ల మండలంలో జాతీయ స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కూర సురేందర్ రెడ్డి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బండారు సమ్మయ్య బీజేవైఎం జిల్లా నాయకులు పంజాల కుమార్ గౌడ్ మండల నాయకులు చాటగోల్ల తిరుపతి మేకల వీర రెడ్డి . దేశెట్టి మహేందర్, దొమ్మటి రవీందర్ దేశెట్టి లక్ష్మయ్య.వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన చెట్లను తొలగించే బాధ్యత ఎవరిదీ ..?

- **పస్రా-తాడ్వాయి మధ్య ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్లు**



**ఏటూరునాగారం, ఆగస్టు 13, మనం ప్రతినిధి:** పస్రా-తాడ్వాయి మధ్య జాతీయ రహదారి-163కు ఆనుకుని ఉన్న ఎండిన చెట్లు వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అటవీ ప్రాంతం కావడంతో రహదారికి ఇరువైపులా పలుచోట్ల చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్ని చెట్ల కొమ్మలు విరిగి రహదారి పక్కన పడివుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే సమయంలో ఎండిన చెట్లు, కొమ్మలు రోడ్డుపై కూలితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని వాహనదారులు చెబుతున్నారు. గతంలో ప్రాణం బలిగొన్న చెట్టు.. ఇప్పటికే ఈ మార్గంలో చెట్టు కూలి ప్రాణం కోల్పోయిన ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. గతంలో చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునాగారం వైపు బైౖ వస్తున్న వ్యక్తిపై చెట్టు పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. బాధ్యత ఎవరిది. .? రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్లను గుర్తించి తొలగించాల్సిన బాధ్యత అటవీ శాఖదా..? జాతీయ రహదారుల అధికారులదా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖలు పరస్పరం బాధ్యతలు చెప్పుకోకుండా ప్రమాదకర చెట్లను గుర్తించి వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి నివారించడం ముఖ్యమని వాహనదారులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పస్రా-తాడ్వాయి రహదారిని పరిశీలించి, రోడ్డుకు ఆనుకుని ఉన్న ఎండిన చెట్లు, విరిగిన కొమ్మలను తొలగించి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పలిమెల మండలంలో పాలనాధికారి పర్యటన

- **పలు అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**



**భూపాలపల్లి, ఆగస్టు 13 మనం ప్రతినిధి:** జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ గురువారం పలిమల మండలంలో విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రధానమంత్రి కృషి సంచాయి కింద జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని 21 గ్రామపంచాయతీలకు 214 ఫామ్ పాండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 157 పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఒక్కో ఫామ్ పాండ్కు సుమారు రూ.1.30 లక్షల వ్యయం అవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఫామ్ పాండ్ల నిర్మాణంలో భూపాలపల్లి జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఫామ్ పాండ్ల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపు తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీని సందర్శించిన కలెక్టర్... పంకెన గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాల వసతులపై వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థినులకు సూచించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తయారు చేయించిన ఉచిత యూనిఫామ్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఇంటర్మీడియట్ కళాశాల భవనాన్ని పరిశీలించి, అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేసి కళాశాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి ద్వారా 3 లక్షల రుణాల చెక్కులతో పాటు మహిళా సంఘాలకు రూ.7.50 లక్షల రుణాలు పలిమెల మండలంలోని నాలుగు మహిళా సంఘాలకు అందచేశారు. దమ్మూరు గ్రామంలో మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. మహిళా సంఘ సభ్యులతో మాట్లాడి వారు చేపడుతున్న ఉపాధి, ఆదాయ మార్గాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాలను విస్తరించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పలిమల గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు, పెయింటింగ్ తదితర పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రధాన రహదారి నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిని వెడల్పుగా, సౌకర్యవంతంగా నిర్మించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవీందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరరావు, డీపీఎం రవి, పిఎంకెఎస్ వై ప్రాజెక్టు అధికారి సతీష్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ మహేశ్వరి తదితర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య నాణ్యమైన భోజనం అందించాలి



- **గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్**

**భూపాలపల్లి /కాటారం /మహాదేవపూర్ ఆగస్టు 13 మనం న్యూస్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం, వసతులు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్ తెలిపారు. గురువారం మేడిపల్లి, మహదేవ్పూర్, కాళేశ్వరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతులు, పాఠశాలల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం, వసతులు, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహదేవ్పూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన డీటీడీఓ, భోజన నాణ్యత, అమలు చేస్తున్న కామన్ మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు పాఠశాలల్లో కామన్ మెనూ సక్రమంగా అమలు అవుతున్నట్లు, ఉపాధ్యాయులు రూపొందించిన లెసన్ ప్లాన్స్ సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల మధ్య సమన్వయం బాగుందని, పాఠశాలల్లో సానుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన సందర్భంగా వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, విద్యార్థులందరూ సంతోషంగా ఉన్నట్లు గుర్తించినట్లు డీటీడీఓ నాగసాగర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## వెదురు సాగుతో ఆదాయాన్ని పొందాలి

- **కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి ఆగస్టు 13 మనం ప్రతినిధి:** రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం నాడు ఆయన మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతోందని, సుమారు 70 వేల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,200 మంది రైతులను వెదురు సాగు కోసం గుర్తించినట్లు, 15 కుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు విబిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వెదురు సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం నర్సరీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలిని జిల్లా కలెక్టర్ అభినందించారు. నర్సరీ నిర్వహణలో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ తాండ్ర సురేష్, ఏపి ఎం రాజన్న, గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



**మహాదేవపూర్, ఆగస్టు 13(మనం న్యూస్):** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మహాదేవపూర్ పోలీసులు పట్టుకుని, వారి వద్ద నుంచి ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్టు మహాదేవపూర్ ఎస్సై సాంబ మూర్తి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సుమారు ఆరు గంటలకు మహాదేవపూర్ పోలీసులకు అందిన సమాచారం మేరకు, పోలీస్ సిబ్బంది కాటారం వైపు నుంచి వస్తున్న టిఎస్ 25- బి - 4517 వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో పదనాలుగు ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు యాభై కిలోల చొప్పున మొత్తం ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు 24,500 లు గా అంచనా వేశారు. ఈ ఘటనలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న బొమ్మ గణపతి, హనుమల గణపతి లను అదుపులోకి తీసుకుని, బియ్యం తో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.మహాదేవపూర్ పోలీసులు ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే, వెంటనే 8712658116 నంబర్కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

- **పైలాన్ నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి సీతక్క**



**ములుగు, ఆగస్టు 13, మనం ప్రతినిధి:** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నా సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రం నకు చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా సేవలను అందించాలి




- **ఎస్పీ సంకీర్త్**

**భూపాలపల్లి, ఆగస్టు 13 మనం ప్రతినిధి:** పోలీసులు ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించాలని ఎస్పి సంకీర్త్ అన్నారు. గురువారం నాడు ఆయన కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహాముత్తారం పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు స్టేషన్లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను నాణ్యతతో దర్యాప్తు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సబ్ డివిజనల్ అధికారి సూర్యనారాయణ, కాటారం సిఐ నాగార్జున రావు తదితరులున్నారు.

## నటి శ్రీదేవీ బయోగ్రఫీపై కీలక అప్ డేట్..!

దిగ్గజ నటి శ్రీదేవి జయంతి సందర్భంగా నటి ప్రియాంక చోప్రా ఆమె జీవిత చరిత్ర పుస్తకానికి సంబంధించిన తాజా అప్ డేట్ ను పంచుకున్నారు. ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో 'ఎంప్రెస్- ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి' పుస్తక ముఖచిత్రాన్ని షేర్ చేస్తూ ఆమెకు నివాళులర్పించారు. 'మీరు ఎంతో గుర్తుకొస్తున్నారు. స్వర్గంలో ఉన్న మీకు జన్మదిన శుభాకాంక్షలు. శ్రీదేవి త్వరలో వస్తోంది' అని ప్రియాంక పేర్కొన్నారు. ఈ పోస్టును శ్రీదేవి భర్త బోనీ కపూర్ కూడా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నారు.



2023లో వెస్ట్ ల్యాండ్ బుక్స్ శ్రీదేవి అధికారిక జీవిత చరిత్రను ప్రచురిస్తున్నట్లు ప్రకటించింది. రచయిత ధీరజ్ కుమార్ రచించిన ఈ పుస్తకం శ్రీదేవి సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితం, ఆమె వదిలివెళ్లిన వారసత్వాన్ని తెలియజేయనుంది.

ఒకానొక సమయంలో భారతీయ సినీ పరిశ్రమను ఏలిన శ్రీదేవి.. 2018 ఫిబ్రవరి 24న దుబాయ్లో కన్నుమూశారు. బంధువు మోహిత్ మార్వా వివాహానికి హాజరైన సమయంలో ఆమెకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. 'మిస్టర్ ఇండియా', 'చాందినీ', 'హిమ్మత్వాలా' వంటి చిత్రాలతో ఆమె భారతీయ సినీ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. తెలుగులోనూ స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

**శ్రీదేవి చివరి చిత్రం..**

శ్రీదేవి ప్రధాన పాత్రలో నటించిన చివరి చిత్రం 'మామ్' (2017). ఇది ఆమె కెరీర్ లో 300వ చిత్రం. దీనికి గాను ఆమెకు మరణానంతరం జాతీయ చలనచిత్ర పురస్కారం లభించింది. ఆమె మరణానంతరం విడుదలైన 'జీరో' (2018) చిత్రంలోనూ అతిథి పాత్రలో కనిపించారు.

## గంభీర్ ముక్కుసూటి మనిషి.. అందుకే నచ్చడం లేదేమో: హర్భజన్

టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై వస్తోన్న విమర్శలను మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఖండించారు. ఏదైనా మ్యాచ్ లేదా సిరీస్ ఓడిపోతే వెంటనే క్వోచ్ విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషి అని ప్రశంసించాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి నచ్చడం లేదేమోనని హర్భజన్ వ్యాఖ్యానించాడు. గంభీర్ కోచింగ్ లో మన జట్టు ఐసీసీ టోర్నీలను గెలిచిన విషయాన్ని గుర్తు చేశాడు.



''గంభీర్ ఎందుకు ఇంతలా విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే వెంటనే కోచ్ను నిందించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. అతడు క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచీ నాకు తెలుసు. ఆటపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ తొలినాళ్లలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతడికి మంచి స్నేహితులు. ఇప్పటికీ వారే ఫ్రెండ్స్ అనుకుంటా. అతడు ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడతాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి మింగుడుపడవు. కవర్ చూసి పుస్తకాన్ని ఎలాంటిదో నిర్ణయించకూడదని పెద్దలు అంటారు. పైకి అలా ఉండే గంభీర్ ను విమర్శించడమూ తప్పే. విజయం కోసమే ఆడాలి అని బలంగా నమ్మే కోచ్ అతడు. ఓటమిని కనీసం ఊహించడానికి కూడా ఇష్టపడడు. డ్రా కోసం వెళ్లేందుకూ సుముఖత వ్యక్తం చేయడు'' అని హర్భజన్ తెలిపాడు.

**శుభ్ మన్ సక్సెస్ వెనుక..**

''ఎవరికైనా సరే సక్సెస్ ఒక్కసారిగా వచ్చేయదు. శుభ్ మన్ గిల్ విషయంలోనూ అంతే. ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ లో అతడి కెప్టెన్సీని చూశాం. అతడి సత్తా మనందరికి తెలిసింది. బ్యాటర్ గా పరుగులు రాబట్టాడు. సారథిగా జట్టును బాగా నడిపించాడు. ప్రతి ప్లేయర్ కెరీర్ లో ఒడుదొడుకులు సహజమే. గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. వ్యక్తిగతంగానూ అతడు చాలా అద్భుతం'' అని హర్భజన్ ప్రశంసించాడు.

**పరుగులు చేస్తున్నారుగా..**

''లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఫుట్ బాల్ ఆడుతున్నారు. మరి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగితే తప్పేంటి? ఏ ప్లేయర్కైనా సరే ప్రదర్శనే గీటురాయి. వయసు ముఖ్యం కాదు. విరాట్ వయసు 37 ఏళ్లు దాటినా.. ఇరవై ఏళ్ల కుర్రాడిలా మైదానంలో హుషారుగా ఉంటాడు. మెస్సిని ఆపాలంటే ఇప్పటికీ ఐదుగురు ప్లేయర్లు కష్టపడాలి. భారత జట్టులో ఫిట్ నెస్ కు సంబంధించి మార్పులు తీసుకొచ్చింది కోహ్లీనే. చివరి రోజు 400 పరుగులు లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. ఒకవేళ ఇప్పుడు ఓటమి ఎదురైనా ఏదొక రోజు సాధించి తీరుతామని చెప్పేవాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు మనందరికీ తెలుసు. కానీ, విరాట్ - రోహిత్ కు అనుభవం ఉంది. వీరిద్దరు ఇప్పుడు ఎలా ఆడుతున్నారనేదే ముఖ్యం. ఇటీవల మ్యాచుల్లో ప్రదర్శన చూస్తే వీరిద్దరూ సఫలమైనట్లే'' అని హర్భజన్ వెల్లడించాడు.

## భారత్-అఫ్గానిస్తాన్ టీ20 సిరీస్ లో మార్పు!

సెప్టెంబర్ లో భారత్-అఫ్గానిస్తాన్ మధ్య మధ్య జరగాల్సిన మూడు టీ20ల సిరీస్ లో మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. ఇటీవల ఖరారైన షెడ్యూల్ ప్రకారం.. ఈ మూడు మ్యాచ్ లు వచ్చే నెల 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే ఈ షెడ్యూల్ లో స్వల్ప మార్పు చేయాలని బీసీసీఐని అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు అభ్యర్థించినట్లు తెలుస్తోంది.

సెప్టెంబర్ 14న గణేష్ చతుర్థి పండగను పురస్కరించుకుని, ఆ రోజున ఒక టీ20 మ్యాచ్ నిర్వహించాలని ఏసీబీ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ రోజు పండగ సెలవు దినం కావడంతో మ్యాచ్ ను వీక్షించడానికి స్టేడియానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వస్తారని అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఆశిస్తోంది.

ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ బోర్డు అంగీకరిస్తే.. సెప్టెంబర్ 13 లేదా 15న జరగాల్సిన మ్యాచ్ లలో ఒకదానిని సెప్టెంబర్ 14కి మార్చనుంది. కాగా ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ ప్రకారం ఇది అఫ్గానిస్తాన్ కు హోమ్ సిరీస్ కావడం విశేషం.

గతంలో అఫ్గాన్ జట్టు తన హోమ్ మ్యాచ్ లను భారత్ లో ఆడినప్పటికి, టీమిండియాతో హోమ్ సిరీస్ ఆడడం మాత్రం ఇదే తొలిసారి. ఈ చారిత్రత్మక సిరీస్ ప్రసార హక్కులకు సంబంధించి అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఇప్పటికే చర్చలు ప్రారంభించింది. సోనీ స్పోర్ట్స్, స్టార్ స్పోర్ట్స్ వంటి ప్రముఖ ఛానళ్లతో ఏసీబీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# కామాక్షి భాస్కర్ల – 'అగధ' చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను..!

**వైవిధ్యమైన కథలతో రాణిస్తున్న కామాక్షి భాస్కర్ల హీరోయిన్గా నటించిన చిత్రం 'అగధ'. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ప ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదలవుతోంది. శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, భాను చందర్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా విడుదల సందర్భంగా కామాక్షి భాస్కర్ల మీడియాతో పంచుకున్న విశేషాలు ఇవే.**



**శ్యాంప్రసాద్ రెడ్డి గారు మిమ్మల్ని అనుష్కతో పోల్చారు? దానిపై మీ స్పందన ఏంటి?**

అంత పెద్ద నిర్మాత నన్ను అనుష్క గారితో పోల్చడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మాటలు నాపై మరింత బాధ్యతను పెంచాయి.

**'అగధ'లోని యాక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పండి?**

'అగధ'లో యాక్షన్ సీన్స్ కోసం ముందే వర్క్ షాప్స్, రిహార్సల్స్ చేశాం. సెట్లో చిన్న ఇబ్బందులు ఉన్నా, టీం వర్క్ వల్ల అవుట్ పుట్ బాగా వచ్చింది.

**'అగధ' జర్నీలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

మహాదేవి పాత్రలోకి మారడం నాకు పెద్ద సవాలు. కామాక్షిని, నా ఆలోచనలని పక్కనపెట్టి ఆ పాత్రగా మారడానికి బుద్ధిజం పుస్తకాలు చదివి, బ్లాక్ మ్యాజిక్, ముద్రలు మరియు నడక శైలిపై రీసెర్చ్ చేశాను. దేవుడి అనుగ్రహంతో దక్కిన ఈ పాత్రలో ఎక్కడా కామాక్షి కనిపించకుండా నటించాను.

**ఎం.ఎస్. రాజు గారి నుంచి ఫోన్ రావడం ఎలా అనిపించింది?**

నాకు ఎం.ఎస్. రాజు గారి సినిమాలంటే చాలా ఇష్టం, అందులో 'మనసంతా నువ్వే' నా ఆల్ టైమ్ ఫేవరెట్. ఆయన నన్ను 'పొలిమేర'లో చూసి 'అగధ' కోసం కాంటాక్ట్ చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. ఆయన సినిమాల్లో ప్రతి పాత్ర చాలా పవర్ఫుల్గా ఉంటుంది.

**'అగధ'ను అంగీకరించడానికి మీకు నచ్చిన అంశాలు ఏంటి?**

రాజు గారి నుంచి పిలుపు వచ్చిందంటేనే అందులో కొత్త పాయింట్, బలమైన పాత్ర ఉంటాయని అర్థమైంది. అందుకే కథ వినకముందే ఆయనపై నమ్మకంతో ఓకే చెప్పేశా. తర్వాత 'అగధ' కథ, నా క్యారెక్టర్ విన్నాక ఇంకా బాగా నచ్చాయి. ఫలితాల కంటే వర్క్ ప్రాసెస్ను, రాజు గారితో పనిచేసే అనుభవాన్ని ఆస్వాదించడానికే ఈ సినిమా చేశాను.

**'అగధ'లోని హారర్, థ్రిల్లింగ్ మూమెంట్స్ గురించి చెప్పండి?**

'అగధ'లో హారర్ కంటే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, డివైన్ మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. సినిమా చివర్లో ప్రేక్షకులకు ఒక మంచి డివైన్ ఫీలింగ్ కలుగుతుంది.

**టెక్నికల్ టీం గురించి చెప్పండి?**

నాని చమిడిశెట్టి గారి కెమెరా వర్క్, ఆయన చేసిన ప్రయోగాలు రాజు గారి విజన్కి ప్రాణం పోశాయి. డీఐ వర్క్ చాలా బాగుంది. రాజీవ్ గారి ఆర్ట్ వర్క్, అమ్మవారి విగ్రహం సెట్స్ తెరపై మ్యాజిక్లా అనిపిస్తాయి. ఇక రీ-రికార్డింగ్ అయితే కొన్ని సీన్స్ని నెక్స్ట్ లెవెల్కి తీసుకెళ్లింది.

**మున్ముందు దర్శకత్వం వహించే అవకాశం ఉందా?**

ఇంతకుముందు నేను అసిస్టెంట్ డైరెక్టర్గా, అసోసియేట్ డైరెక్టర్గా, రైటింగ్ టీంలోనూ పనిచేశాను. దర్శకత్వం వహించాలనే ఆలోచన ఉంది కానీ, దానికి ఇంకా చాలా టైమ్ పడుతుంది.

**'అగధ' విజయంపై మీకున్న నమ్మకం గురించి చెప్పండి?**

'అగధ' ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ముఖ్యంగా రాజు గారి కంబ్యాక్ కోసం ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వాలి. నేను ఆల్రెడీ సినిమా చూశాను; సెట్లో సాధారణంగా అనిపించిన సీన్స్ కూడా స్క్రీన్ మీద అద్భుతంగా వచ్చి నన్ను ఆశ్చర్యపరిచాయి. సినిమా చూస్తున్నంతసేపూ భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయి, ఆఖరిగా ఎంతో సంతృప్తిగా అనిపించింది.

## జై హనుమాన్ కోసం శ్రీరాముడు కావలెను..

### ప్రశాంత్ వర్మ మైండ్‌లో ఉన్న హీరో ఎవరు?

యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ యూనివర్స్ నుంచి రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 'జై హనుమాన్'. 2024 సంక్రాంతి స్పెషల్ గా వచ్చిన 'హనుమాన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడంతో ఇప్పుడు దీనికి సీక్వెల్ గా తెరకెక్కుతోన్న 'జై హనుమాన్'పై భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే.. హనుమాన్ చిత్రంలో రాముడి పాత్ర లేనప్పటికీ.. జై హనుమాన్ లో మాత్రం రాముడి పాత్ర రావాల్సి ఉంది. దీంతో ఈ సినిమాలో రాముడి పాత్ర కోసం ఎవరిని తీసుకుంటారు అనే దానిపై ప్రజెంట్ సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలోనే తాజాగా రాముడి పాత్రకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతున్నది. నెట్టింట వైరల్ అవుతున్న సమాచారం మేరకు..



జై హనుమాన్ సినిమాలో రాముడి ఎపిసోడ్ కు కీలకమైన స్థానం ఉందట. ఆ పాత్ర కోసం స్టార్ హీరోల్ని సంప్రదించే పనిలో ఉన్నాడట డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. ఆయన మైండ్ లో చాలా పెద్ద హీరోలు ఉన్నారని తెలుస్తుంది. రాముడి పాత్ర, అందులోనూ హనుమాన్ ఫ్రాంచైజీ అంటే.. హీరోలు మెగ్గు చూపించే చాన్స్ ఉంది. కానీ, వచ్చిన సమస్య ఏంటేంటే.. ఎంత కాదన్నా 'జై హనుమాన్' సినిమా అనగానే ఇది రిషబ్ శెట్టి సినిమాగానే చలామణీ అవుతుంది కాబట్టి.. గెస్ట్ రోల్ అవసరమా? అని కూడా ఆలోచించొచ్చు. దీంతో రాముడి పాత్రకు టాలీవుడ్ హీరోల్ని ఒప్పించడం కష్టమే అవుతుండగా.. ఈ పాత్ర కోసం కన్నడ నుంచే ఓ హీరోని ఒప్పిస్తాడా? లేదా రాముని పాత్రను పూర్తిగా ఏఐలో డిజైన్ చేస్తారా అనేది ప్రశాంత్ వర్మ ఆలోచనపై ఆధారపడి ఉంది. ఏదిఏమైనప్పటికీ ప్రస్తుతం ఈ వార్త మాత్రం నెట్టింట వైరల్ అవుతున్నది.

## నేను బరువు తగ్గను..

### ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన స్వరా భాస్కర్



బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ తనను దారుణంగా ట్రోల్ చేస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పారు. పెళ్లై, పాప పుట్టిన తర్వాత ఆమె కాస్త లావు అవ్వడంతో కొంతమంది నెటిజన్లు ఆమె రూపంపై దారుణమైన కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. ఈ విషయంపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన స్వరా, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకరి బరువు గురించి మాట్లాడటానికి మీకు అంత ఖాళీ సమయం ఉందా అని స్వరా ప్రశ్నించారు. 'నా జీవితం మీ మాటలపై నడవదు. అందంగా కనిపించే అమ్మాయిలను చూడాలనుకుంటే వేరే పేజీలు చూసుకోండి, నా ప్రొఫైల్ కు రావాలని మిమ్మల్ని ఎవరూ అడగలేదు' అని తెగేసి చెప్పారు. ఒక మహిళ తల్లి అయిన తర్వాత ఆమె శరీరంలో మార్పులు రావడం చాలా సహజమని గుర్తుచేశారు.

సినిమాలో ఎప్పుడూ అందంగా కనిపించాలని సర్జరీలు, ఇంజెక్షన్లు చేయించుకోవడం సాధారణమే కావచ్చు కానీ, కాలంతో పాటు మన రూపురేఖలు మారడం సహజమని చెప్పారు. గతంలో తన భర్త ఫహద్ తో కలిసి బయటకు వెళ్లినప్పుడు మేకప్ లేకుండా ఉన్న ఫోటోలను కావాలనే వైరల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే మతం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడం వల్లే ఇలా అయ్యానంటూ కొందరు కామెంట్లు చేశారని, అది తన భర్తను కూడా బాధించిందని చెప్పారు. అయితే ఇలాంటి కామెంట్లకు తాను భయపడేది లేదని స్వరా స్పష్టం చేశారు. 'మీరు విమర్శిస్తున్నారని నేను బరువు తగ్గను, పైగా ఇంకా లావుగా ఉన్న ఫోటోలనే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను' అని సవాల్ విసిరారు. ఆడవాళ్లు ఏ రంగంలో ఉన్నా ఇలాంటి సమస్యలను తట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.